మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 206 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad









# బాపుకు ఘన నివాళి

- మహాత్ముడికి రాజ్‌ఘాట్ వద్ద నివాళులు అర్పించిన రాష్ట్రపతి, ప్రధాని,రాహుల్
- బాపూఘాట్ వద్ద గవర్నర్, సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ/హైదరాబాద్ (ప్రజా మంటలు):

జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయనకు నివాళులర్పించారు. బుధవారం ఉదయం దిల్లీలోని గాంధీ స్మారకం రాజ్‌ఘాట్ వద్దకు వెళ్లి మహాత్ముడికి అంజలి ఘటించారు. అంతకుముందు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రధాని ఆయనకు నివాళులర్పించారు. సత్యం, సామరస్యం, సమానత్వం అనే సిద్ధాంతాలతోనే బాపూజీ జీవితం గడిచింది. ఆయన ఆదర్శాలు దేశ ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిని ఇస్తాయని గాంధీజీని గుర్తు చేసుకున్నారు. ఆయనతో పాటు పలువురు ప్రముఖులు రాజ్‌ఘాట్ వద్ద జాతిపితకు నివాళులర్పించారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, దిల్లీ లెఫ్టినెంట్

మిగతా 2లో..



# నేటి నుంచి డిజిటల్ హెల్త్ కార్డు పైలట్ సర్వే

- 238 ప్రాంతాల్లో ప్రక్రియ చేపట్టనున్న అధికారులు
- ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, (ప్రజా మంటలు):



కుటుంబ డిజిటల్ హెల్త్ కార్డు ప్రొఫైల్ రూపకల్పన పక్రియను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్నది. ఈ మేరకు డిజిటల్ హెల్త్ కార్డును అమల్లోకి తీసుకుని రాబోతున్నది. ఎలాంటి భేదాలు లేకుండా ప్రజలందరికీ హెల్త కార్డుల వివరాలు పొందు పర్చనుంది. ఈ మేరకు గురువారం పైలెట్ ప్రాజెక్ట్‌ను సిఎం రేవంత్ ప్రారంభిస్తారు. మరోవైపే ఈ అంశంపై చర్చించినరెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి కుటుంబానికి హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, ప్రత్యేక నంబరుతో స్మార్ట్ కార్డులివ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు 119 నియోజకవర్గాల్లోని 238 ప్రాంతాల్లో పైలట్ సర్వే నిర్వహిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభిస్తారు. అత్యంత ప్రాముఖ్యం కలిగిన ఈ కార్డుల కోసం పొరపాట్లకు తావు లేకుండా వివరాలు నమోదు చేయించాలని కలెక్టర్లను ఇప్పటికే ఆదేశించారు. నియోజకవర్గంలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకుని ఎన్యుమరేషన్ చేపడతారు.. ఒకవేళ పూర్తిగా అర్బన్ ప్రాంతమైతే రెండు వార్డులు/డివిజన్లు ఎంచుకుంటారు. ప్రతి నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి, జోనల్ కమిషనర్ స్థాయి అధికారులను, మండలానికైతే ఒక తహసీల్దారును ప్రత్యేకాధికారులుగా నియమించారు. కుటుంబసభ్యుల వివరాల నమోదు, మార్పుచేర్పుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా డిజిటల్ సర్వేకు అధికారులు రంగం సిద్ధం చేశారు.

# సమంత-నాగచైతన్యలకు కేటీఆర్ వల్లే విడాకులు

- అనేక మంది హీరోయిన్ల జీవితాలు నాశనం చేశాడు
- సినిమావాళ్లకు డ్రగ్స్ అలవాటు చేసిన ఘనుడు
- మంత్రి కొండ సురేఖ సంచలన ఆరోపణలు



హైదరాబాద్, (ప్రజా మంటలు):

అక్కినేని హీరో నాగచైతన్య, హీరోయిన్ సమంత విడిపోవడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆరే కారణమని మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్‌కు హీరోయిన్ల జీవితాలతో ఆడుకోవడం అలవాటని.. వారికి డ్రగ్స్ అలవాటు చేసింది ఆయనేనని ఆరోపించారు. బాపూఘాట్ లో గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'కేటీఆర్ కు తల్లి అక్క, చెల్లి లేరా. హీరోయిన్ల జీవితాలతో కేటీఆర్ ఆడుకున్నారు. మత్తుపదార్థాలు అలవాటు చేశారు. వాళ్ల ఫోన్లు ట్యాప్ చేశారు. చాలా మంది హీరోయిన్లు త్వరగా పెళ్లిళ్లు చేసుకుని సినిమా ఇండస్ట్రీ నుంచి తప్పుకోవడానికి ఆయనే కారణం. ఆయన డ్రగ్స్‌కు అలవాటుపడి వాళ్లకూ అలవాటు చేశారు. రేవ్ పార్టీలు చేసుకుని వాళ్లని బ్లాక్ మెయిల్ చేశారు. ఈ విషయం సినీ ఇండస్ట్రీలో

మిగతా 2లో..

## పొలిట్రిక్స్

అప్పుడేమో ఇందిరమ్మ
ఇప్పుడేమో సోనియమ్మ
స్వదేశీ, విదేశీ సూత్రాలు
వల్లించడం ఎందుకమ్మ !

అంతమాయె 'రాజీ'వునితో
తమ 'గాంధీ'ల పాలన
గింజుకుంటే ఏంలాభం
పొత్తులతో గట్టెక్కున ?!

- న్యాలకంటి నారాయణ
9346200066

# స్వచ్ఛభారత్‌లో అందరూ భాగస్వాములు కావాలి

- దేశప్రజలకు పిలుపునిచ్చిన మోదీ
- విద్యార్థులతో కలిసి వీధులు శుభ్రం చేసిన ప్రధాని..

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):

జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రజలు సైతం పాల్గొనాలని ఈసందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. 'నేను, నా యువ స్నేహితులతో కలిసి స్వచ్ఛత అభియాన్‌లో భాగమయ్యాను. మీరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాను. ఈ చొరవ స్వచ్ఛభారత్ స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తుంది' అని మోదీ తన ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇక, ప్రధాని మోదీ పిలుపుమేరకు పలువురు రాజకీయ నాయకులు స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిషన్‌రెడ్డి, రాజివ్‌రంజన్, ముఖేశ్ మాండవీయతో పాటు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు. 2014 అక్టోబర్ 2న




గాంధీ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ 'స్వచ్ఛ్ భారత్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం మరుగుదొడ్ల నిర్మాణం, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యం. స్వచ్ఛభారత్ కార్యక్రమం విజయవంతమవడానికి కోట్లమంది

మిగతా 2లో..

# రాజకీయాల్లోకి మమ్మల్నెందుకు లాగుతున్నారు?

- మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు సరికాదన్న నాగార్జున
- సరైన సాక్ష్యాధారాలు లేకుండా మాట్లాడటం సరికాదన్న ప్రకాశ్‌రాజ్


హైదరాబాద్, (ప్రజా మంటలు):



అక్కినేని కుటుంబాన్ని ప్రస్తావిస్తూ మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై హీరో అక్కినేని నాగార్జున స్పందించారు. కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని ప్రకటించారు. రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలను, మీ ప్రత్యర్థుల్ని విమర్శించేందుకు వాడుకోకండి. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలను గౌరవించండి. బాధ్యత కలిగిన పదవిలో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం. తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను అని నాగార్జున అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. ఈ విషయమై నటుడు ప్రకాష్ రాజ్ కూడా

మిగతా 2లో..

## ప్రజా నాడి




# రాహుల్‌కు ఏం సంబంధం?

- కాంగ్రెస్ నాయకుల మండిపాటు
- భారాస నాయకులు 800 చెరువులను కబ్జా చేశారు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్
- పేదల భూములతో వ్యాపారం చేశారు:మంత్రి సీతక్క



హైదరాబాద్, (ప్రజా మంటలు):

భారాస అధినేత కేసీఆర్ ఎక్కడున్నారో కేటీఆర్ చెప్పాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..భారాస, ఆ పార్టీ నేతల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు."భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 800 చెరువులను కబ్జా చేశారు. కబ్జా చేశారు కాబట్టే ఆ పార్టీ నేతలు భయపడుతున్నారు. రాహుల్ గాంధీకి.. హైడ్రాకు ఏంటి సంబంధం? ఇంకా డీపీఆర్ రూపొందించలేదు. అలాంటప్పుడు అవినీతి ఎలా జరుగుతుంది? మూసీ ప్రక్షాళన చేసి ఆదుకుంటామని గతంలో కేసీఆరే అన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోని నిర్మాణాలనే హైడ్రా కూల్చుతోంది. హైడ్రా, కూల్చివేతలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్‌లో చెరువులకు పూర్వ వైభవం తీసుకొస్తాం" అని వెల్లడించారు.

పేదల భూములతో వ్యాపారం చేశారు:మంత్రి సీతక్క

హైదరాబాద్: ప్రజల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ప్లాట్లుగా మార్చి అమ్ముకున్న చరిత్ర భారాస పార్టీదని మంత్రి సీతక్క ఆరోపించారు. బుధవారం హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన సరస్ ఫెయిర్-2024 బతుకమ్మ వేడుకల్లో సీతక్క పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. "కేటీఆర్.. చాట్ చాట్‌గా కాదు డైరెక్ట్‌గా వచ్చి మాట్లాడు. పండుగపూట కూడా అనవసరంగా మమ్మల్ని విమర్శిస్తున్నారు. రాహుల్ గాంధీ కుటుంబం త్యాగం, కష్టం, నిజాయితీ ముందు మీరెంత? రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి కేటీఆర్‌ది కాదు. బీసీ, ఎస్టీ మంత్రులుగా ఆర్థిక నేపథ్యంతో కాకుండా.. స్వతంత్రంగా ఎదిగాం. మేం సమ్మక్క సారలమ్మ, రాణి రుద్రమ ప్రాంతాల నుంచి వచ్చాం. ఎందుకు మా మీద అక్కసు. వరదల్లో మునిగి ప్రజలు నష్టపోవద్దని ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టింది. మూసీ కూల్చివేతల అంశంలో పేదలకు నష్టం రాకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం చెప్పారు. అసభ్యకరంగా దూషించి మమ్మల్ని శిఖండి అని ఎలా అంటారు? గతంలో మహిళా మంత్రుల చరిత్ర, ఇప్పటి మహిళా మంత్రుల చరిత్ర ప్రజలకు తెలుసు. మేం నామినేట్ చేస్తే అప్పనంగా వచ్చినోళ్లం కాదు. ప్రజల చేత ఎన్నుకున్న మంత్రులం. పనిగట్టుకొని మేం సినిమావాళ్ల గురించి మాట్లాడలేదు. ఎవరి వ్యక్తిగత జీవితం వాళ్లకు ఉంటుంది. సందర్భాన్ని బట్టి కొంత మంది సినీ ప్రముఖులపై మాత్రమే మాట్లాడారు. సినీ నటులకు మేం వ్యతిరేకం కాదు.. వాళ్లను ద్వేషించడం లేదు. పండగపూట ప్రజలు, ఆడబిడ్డలను ఆనందంగా ఉంచాలి.తెలంగాణ మహిళలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు. బతుకమ్మ అంటేనే చెరువులను పూజించే పండుగ.. పూలను పూజించే పండుగ. ఆడబిడ్డలు పుట్టింటికి వచ్చి కష్టాలు పంచుకునే పండుగ బతుకమ్మ. కనీసం ఈ తొమ్మిది రోజులైనా ఆడబిడ్డలను స్వేచ్ఛగా ఆడుకోనివ్వండి. ఉద్యోగ, రాజకీయాల్లో ఉన్నత స్థానానికి వచ్చే విధంగా కుటుంబాలు ప్రోత్సహించాలి.. అండగా ఉండాలి" అని మంత్రి సీతక్క అన్నారు.

మొదటి పేజీ తరువాయి

# బాపుకు ఘన నివాళి

గవర్నర్ వీకే సక్సేనా, ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ తదితరులు మహాత్ముడి సేవలను స్మరించుకున్నారు.

**బాపూఘాట్ వద్ద గవర్నర్, సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు**

గాంధీ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహానీయుడిని స్మరించుకున్నారు. జాతిపిత చూపిన మార్గంలో నడవాలని ప్రముఖులు ఆకాంక్షించారు. బాపుఘాట్ వద్ద గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు పుష్పాంజలి ఘటించారు.

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ లంగర్?హౌజ్‌లోని బాపూఘాట్‌లో ప్రముఖులు నివాళులర్పించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు జాతిపితకు పుష్పాంజలి ఘటించారు. నేటి తరానికి గాంధీ సిద్ధాంతాలు ఆచరణీయమన్న గవర్నర్ మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారానికి అందరూ పాటుపడాలని కోరారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పీసీసీ చీఫ్ మహేశ్?కుమార్ గౌడ్‌తో కలిసి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి బాపూఘాట్‌లో మహాత్ముడికి నివాళులర్పించారు. గాంధీజీ చూపిన బాటలో నేటితరం నడవాలని సీఎం ఆకాంక్షించారు. జాతిపిత సిద్ధాంతాలు, ఆశయాలు యువతకు ఆచరణీయమని కొనియాడారు. బాపూఘాట్ వద్ద సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అసెంబ్లీ ఆవరణలో గాంధీ విగ్రహానికి మండలి ఛైర్మన్ గుత్తాసుఖేందర్ రెడ్డి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ సభాపతి మధుసూదనాచారి, ఎమ్మెల్సీ ఎల్.రమణ తదితరులు నివాళులర్పించారు.సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ పరిసరాల్లో రహదారులు, వీధులను ఊడ్చి చెత్తను తొలగించారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలనే ఉద్దేశంతో పదేళ్ల కిందట ప్రధాని మోదీ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారని కేంద్రమంత్రి అన్నారు.

## స్వచ్ఛభారత్‌లో అందరూ భాగస్వాములు కావాలి

భారతీయులే కారణమని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతుగా ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ప్రజలు ఎక్కువగా తమంతతాముగా పాల్గొన్నప్పుడే ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందని అన్నారు. దేశం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని, కానీ వాటిని చూసి మనమెప్పుడూ పారిపోలేదు. ధైర్యంగా ముందుకు సాగుతున్నాం, వాటిని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం. వెయ్యి మంది మహాత్మాగాంధీలు, లక్ష మంది నరేంద్రమోదీలు, అన్ని రాష్ట్రల సీఎంలు, ప్రభుత్వాలు వచ్చినా.. స్వచ్ఛ్‌ఇండియా సాకారం కాలేకపోయేది. కానీ కోట్ల మంది భారతీయుల వల్ల అది సాధ్యపడిందని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే కార్యక్రమం ముందుకు సాగుతుందని అన్నారు. స్వచ్ఛభారత్ ఉద్యమం వల్ల సమాజంలో సానుకూలమైన పోటీ వాతావరణం నెలకొందని అంటూ అది స్వచ్ఛ ర్యాంకులను చూస్తే తెలుస్తోంది. ఈ ఉద్యమం కోసం ప్రజలు ఎంత కృషి చేశారో అర్థమవుతోంది. దేశమంతా క్లీన్ ఇండియా ప్రచార కార్యక్రమాన్ని స్వాగతించింది. ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. నేడు ఇది సామాన్యుడి ప్రచార కార్యక్రమని మోదీ పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ కల సాకారం కావడానికి వెయ్యి మంది మహాత్మా గాంధీలు, లక్ష మంది నరేంద్ర మోదీలు సరిపోరని, ఇది ప్రజా ఉద్యమమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నదని, అంతమాత్రాన మనం వాటి నుంచి దూరంగా పారిపోమని మోదీ స్పష్టంచేశారు. సవాళ్లకు ఎదురొడ్డి నిలిచి, వాటిని అధిగమిస్తామని ఆయన అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ వల్ల ఓ సానుకూల పోటీ దేశంలో నెలకొని ఉన్నదని చెప్పారు. కొందరు ఇప్పటికీ స్వచ్ఛభారత్ ను హేళన చేస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ వాపోయారు. స్వచ్ఛ భారత్ ప్రభుత్వ కల కాదు? దేశ ప్రజల కల కావాలన్నారు. తనకు పూర్తి విశ్వాసం ఉందని.. అనుకున్నది సాధిస్తామన్నారు. మహిళలకు ఉన్నంత సంస్కారం పురుషులకు లేకుండా పోతుందని.. బహిర్భూమి విషయంలో పురుషుల ప్రవర్తనే దీనికి నిదర్శనమన్నారు. స్వచ్ఛతను సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నారని అన్నారు. అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతుగా ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. స్వచ్ఛతకు ర్యాంకులు కేటాయించడం వల్ల సంస్థలు పోటీ పడి మరీ పరిసరాల పరిశుభ్రత కోసం పాటుపడుతున్నారని కొనియాడారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌ను ప్రారంభించినపుడు చాలా మంది విమర్శించారు. ఇప్పుడు దాని ఫలితాలు ఏంటో స్పష్టంగా కనిపిస్తున్నాయి అని మోదీ అన్నారు. ఈ మిషన్‌లో మీడియా పాత్రను కూడా ఈ సందర్భంగా మోదీ ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ముందు గాంధీ జయంతి సందర్భంగా రాజ్‌ఘాట్‌లో మహాత్మునికి నివాళులర్పించారు.

## రాజకీయాల్లోకి మమ్మల్నేందుకు లాగుతున్నారు?

ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని టార్గెట్ చేస్తూ హీరోయిన్స్ సమంత , రకుల్ ప్రీత్ సింగ్ పేర్లని ప్రస్తావించడంపై ఆయన భగ్గుమన్నారు. మంత్రి సరైన సాక్ష్యాధారాలు లేకుండా హీరోయిన్ల పేర్లు ప్రస్తావించడంపై ఆయన 'ఎక్స్ ఖాతా ద్వారా అసహనం వ్యక్తం చేశారు. ఏంటీ సిగ్గులేని రాజకీయాలు? సినిమాల్లో నటించే ఆడవాళ్ళంటే చిన్న చూపా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు కొండా సురేఖ చేసిన షాకింగ్ కామెంట్స్, ఆమె కామెంట్స్‌పై ప్రకాశ్ రాజ్ చేసిన ట్వీట్ వైరల్ అవుతున్నాయి.

## సమంత-నాగచైతన్యలకు కేటీఆర్ వల్లే విడాకులు



ఉన్న అందరికీ తెలుసు. బీఆర్ఎస్ దొంగ ఏడుపులు మాకవసరం లేదు. హరీశ్ రావు మనస్సున మనిషిగా స్పందించారు. నాపై ట్రోలింగ్ జరిగినప్పుడు ఎందుకు స్పందించలేదు. మంత్రి సీతక్క, మేయర్ గద్వాల విజయలక్ష్మిపై అసభ్యకర పోస్టులు పెట్టారు. ఐదేళ్లు బీఆర్ఎస్‌లో పనిచేశా.. నా వ్యక్తిత్వం అందరికీ తెలుసు. అసభ్యకరంగా పోస్టులు పెట్టినవారిపై ఫిర్యాదు చేశాం. రాజకీయ విలువలు దిగజారిపోయాయి. ప్రభుత్వం తప్పు చేస్తే ఎత్తిచూపాలి. వ్యక్తిత్వం దెబ్బతీసేలా ప్రవర్తించవద్దు. దుబాయి నుంచి నాలుగు సోషల్ మీడియా అకౌంట్లతో నాపై ఫేక్ పోస్టులు పెడుతున్నారు'అని సురేఖ అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తాను మెదక్ వెళ్లినప్పుడు.. చేనేత కార్మికుల సమస్యలను చెబుతూ.. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు గౌరవ సూచకంగా తనకు ఒక నూలు దండ వేస్తే.. దాన్ని బీఆర్ఎస్ సోషల్ మీడియా అసభ్యకరంగా ట్రోల్ చేసిందంటూ మంత్రి కొండా సురేఖ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ ట్రోలింగ్ చూసి గడిచిన రెండ్రోజులుగా తనకు అన్నం సహించడం లేదని, నిద్ర పట్టట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు ఇంట్లో ఆడవాళ్లపైనా ఇలాంటి ట్రోలింగ్ చేస్తే వారికెలా ఉంటుందని ప్రశ్నించారు. రఘునందన్‌రావు తనకు సోదర సమానుడని, ఆయన తనకు ఫోన్ చేసి బాధపడ్డారని వెల్లడించారు. తనపై అసభ్యకరంగా పెట్టిన పోస్టులో డీపీ హరీశ్‌రావుది ఉందన్నారు. తనపైన జరిగిన ట్రోలింగ్‌కు హరీశ్, కేటీఆర్‌లు క్షమాపణ చెప్పాలన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ద్వారా ఇకపైన ఇలా ట్రోలింగ్‌లు చేస్తే క్షమించేది లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు.. కేటీఆర్ బట్టలు విప్పించి బజారున ఉరికిస్తరని హెచ్చరించారు. తనపై అసభ్యకరంగా పెట్టిన పోస్టుపైన సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశామని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికీ తీసుకెళ్లామని చెప్పారు. కాగా.. మీడియా సమావేశం ముగిసేలోపు సురేఖ పలుమార్లు భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. ఇటు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ స్పందిస్తూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ నేతలపైన సోషల్ మీడియా ద్వారా బీఆర్ఎస్ నేతలు దాడులు చేస్తున్నారని, ఈ వర్గాలు కన్నెర్ర చేస్తే వారెక్కడుంటారని ప్రశ్నించారు. సురేఖపై పోస్టులను కేటీఆర్ ఎందుకు ఖండించలేదని నిలదీశారు. కాగా, కొండా సురేఖపై ట్రోలింగ్‌లను నిరసిస్తూ తెలంగాణ భవన్ ముట్టడికి కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు ఉద్రిక్తతకు దారి తీసింది. తెలంగాణ భవన్ వద్ద దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్ఎస్ నేతలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అయితే కొండా సురేఖపై అసభ్యకర పోస్టులు పెట్టడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఖండించారు. మహిళలపై గౌరవించాలని హితవుపలికారు.

# డబ్బుల కోసమే బుల్డోజర్లు

### - ఇది రాహుల్ ఎత్తుగడ : కేటీఆర్

### - మీడియాతో చిట్‌చాట్‌లో కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):



డబ్బు సంచుల కోసమే మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అనుమతిచ్చారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రాహులే వెనకుండి పేదల ఇళ్లపైకి బుల్డోజర్ పంపిస్తున్నారని ఆరోపించారు. హైడ్రాను నడిపిస్తోంది సీఎం రేవంత్‌రెడ్డి కాదని.. రాహుల్ గాంధీయేనని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. కేవలం డబ్బు కోసమే మూసీ ప్రాజెక్టును చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి చేపట్టింది మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. మూసీ లూటిఫికేషన్ అనికేటీఆర్ ధ్వజమెత్తారు. మూసీ సుందరీకరణపై డీపీఆర్ కాదు.. ప్రాజెక్టు రిపోర్టు కూడా లేదని తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్ చాట్ చేశారు.మూసీ ప్రాజెక్టు కోసం డబ్బులు ఎక్కడ్నుంచి తెస్తారు..? అని కేటీఆర్ నిలదీశారు. మూసీపై రెండు, మూడు రోజుల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాను అని తెలిపారు. మూసీ విషయంలో సీఎంకు, మంత్రులకు సయోధ్య ఉన్నట్లు లేదన్నారు. మూసీ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లని ఎవరు చెప్పారని శ్రీధర్ బాబు అంటున్నారు. అభినవ గోబెల్స్ రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని చెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సీఎం మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేని అసమర్థుడు అని కేటీఆర్ విమర్శించారు. డబ్బు సంచుల కోసమే మూసీ ప్రాజెక్టుకు రాహుల్ అనుమతి ఇచ్చారు. రేవంత్ రెడ్డి కాదు.. రాహుల్ గాంధీనే హైడ్రాను నడిపిస్తున్నారు. రాహుల్ వెనుకుండి పేదల ఇండ్లపైకి బుల్డోజర్ నడిపిస్తున్నారు. కేవలం డబ్బుల కోసమే మూసీ ప్రాజెక్టును రాహుల్ చేపట్టారు. బుల్డోజర్ ప్రభుత్వంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రాహుల్ ఎక్కడున్నారు.. మూసీ ప్రాజెక్టును ఏ కాంట్రాక్టర్‌కు ఇస్తారో త్వరలో బయటపెడుతా. కాంగ్రెస్‌కు నోట్ల కట్టలు కావాలి.. కానీ బాధితుల కష్టాలు పట్టవా.. అని కేటీఆర్ నిలదీశారు.

# మాతో పెట్టుకోవద్దు

### - ఇజ్రాయెల్‌పై మా దాడులు ముగిశాయి

### - మళ్లీ ప్రతిదాడులు చేస్తే ప్రతీకారం తీవ్రంగా ఉంటుంది

### - ఇజ్రాయెల్‌కు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ హెచ్చరిక

టెహ్రాన్ (ప్రజామంటలు):

ఇజ్రాయెల్‌పై ఇరాన్ మంగళవారం క్షిపణుల వర్షం కురిపించింది. దాదాపు 200 వరకు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించగా ఇజ్రాయెల్ అడ్డుకునేందుకు ప్రయత్నించింది. ఈనేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఇజ్రాయెల్‌కు కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌తో యుద్ధానికి తాము వ్యతిరేకమని నెతన్యాహుకి తెలియజేయండని ఇజ్రాయెల్ ప్రజలను ఎక్స్‌లో కోరారు.'ఇరాన్ ప్రయోజనాలు, పౌరుల రక్షణలో భాగంగానే దాడులు ప్రారంభించాం. ఇరాన్ యుద్ధానికి పాల్పడే దేశం కాదని నెతన్యాహుకు తెలియజేయండి. ఈ దాడులు మాలో ఒక కోణం మాత్రమే. ఇరాన్‌తో ఘర్షణలకు దిగొద్దు' అని మసూద్ పెజెష్కియాన్ హెచ్చరించారు. ఇజ్రాయెల్‌పై తమ దాడి ముగిసిందని ఇరాన్ వెల్లడించింది. 'ఇజ్రాయెల్ మరింత ప్రతీకారానికి పాల్పడకపోతే మా చర్య ముగిసినట్లే. ఒకవేళ ఇజ్రాయెల్ తిరిగి దాడులు ప్రారంభిస్తే మా ప్రతిస్పందన మరింత తీవ్రంగా, శక్తివంతంగా ఉంటుంది' అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చి ఎక్స్‌లో పేర్కొన్నారు.ఇక, ఐక్యరాజ్యసమతి భద్రతామండలి బుధవారం మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధానికి సంబంధించి సమావేశం నిర్వహించనుంది. ఈసందర్భంగా తక్షణ కాల్పుల విరమణకు పిలుపునిచ్చింది.ఇజ్రాయెల్‌పై ఇరాన్ చేస్తున్న దాడులు అసమర్థమైనవని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ మండిపడ్డారు. అదేవిధంగా ఇరాన్‌కు వ్యతిరేకంగా తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు యూఎస్ వెనకాడబోదని ఇజ్రాయెల్‌కు తమ మద్దతును పునరుద్ఘాటించారు.ఇజ్రాయెల్‌పై ఇరాన్ జరిపిన క్షిపణుల దాడులను శక్తివంతంగా ఎదుర్కొంటున్నామని ఇజ్రాయెల్ సైన్యం బుధవారం తెలిపింది. ఇరాన్ దాడులను వైమానిక దళం ఎదుర్కొంటుందని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారి ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే మంగళవారం రాత్రి జరిగిన దాడులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.



## అహింసా మార్గం ద్వారా మన హక్కులను పొందే మార్గాన్ని సాధించింది ఇద్దరే

### నాడు మహాత్మగాంధీ, నేడు కేసీఆర్

### దేశానికి జాతిపిత మహాత్మ గాంధీ

### తెలంగాణకు జాతిపిత కేసీఆర్ దావ వసంత సురేష్

జగిత్యాల అక్టోబర్ 02 (ప్రజామంటలు):

మహాత్మగాంధీ జయంతిని పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని 40వ వార్డ్ పురాణిపేట్ లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన జగిత్యాల జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంతసురేష్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గాంధీ అనుసరించిన శాంతి, అహింస మార్గాల ద్వారానే రాష్ట్రాన్ని సాధించిన ఘనుడు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ నని గర్వంగా చెప్పుకోవచ్చు అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ హయంలోనే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి ఫలితం దక్కిందని..కానీ ఇప్పటి ప్రభుత్వం దానికి పూర్తి భిన్నంగా వారి ఆశయాలకు నీరుకారుస్తూ కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లలేని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. శాంతి, అహింస మార్గాలు ఏవైతే గాంధీ అనుసరించారో నేడు రాష్ట్రంలో అవి పూర్తిగా విఫలమయ్యాయని శాంతిభద్రతలు కరువై రాష్ట్రంలో అత్యాచారాలకు, ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. స్వార్థ ప్రయోజనమైనటువంటి నేటి రాజకీయాల్లో గాంధీ ప్రవచించిన సూత్రాలను అందించినటువంటి స్ఫూర్తిని అందిపుచ్చుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆవారి శివకేసరి బాబు, మేక పద్మావతి పవన్, ములస్తం లలిత, బిఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, ఉపాధ్యక్షులు వొల్లెం మల్లేశం, మైనార్టీ నాయకులు రిజ్వాన్, ఎత్తేమద్, పట్టణ నాయకులు గాజుల శ్రీనివాస్, వనమాల నిరంజన్, కోరుకంటి రాము,పెండెం గంగాధర్, యూత్ ఉపాధ్యక్షుడు ప్రణయ్, సెక్రటరీ నీలి ప్రతాప్, యూత్ నాయకులు భగవాన్ రాజ్, మణి, దినేష్, వినయ్, పిన్ను, వైశ్య సంఘం అధ్యక్షుడు నవీన్, మరియు పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో విజయ దుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో నేటి నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

గొల్లపల్లి అక్టోబర్ 02 (ప్రజామంటలు):




గొల్లపల్లి మండల కేంద్రంలోని విజయ దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. గురువారం శోభాయాత్ర తో మొదలై, సాయంత్రం గ్రామ పంచాయతీ నుండి శ్రీభక్తాంజనేయ దేవస్థానం చేరుతుంది. ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి అమ్మవారి మహా కలశ స్థాపన, దీక్షలు కార్యక్రమాలతో గురువారం సాయంత్రం 3 నుండి 12 శనివారం విజయ దశమి వరకు ఆలయంలో తొమ్మిది రోజుల పాటు వేడుకలను వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో నిర్వహించేందుకు అన్ని సిద్ధం చేశారు.అలాగే ఆలయంలో లలిత సహస్ర నామ స్తోత్రం పారాయణం , పాటు నిత్యం భక్తులు ఈ ఆలయానికి వస్తూ మహిళలు పూజలు నిర్వహిస్తూ మొక్కలు చెల్లిస్తుండటంతో ఆలయం నిత్యం కిటకిటలాడుతూ ఉంటుంది. తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలను శ్రీ భత్తాంజనేయ స్వామి దేవాలయంలో బ్రహ్మశ్రీ తిరునహరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈసందర్భంగా అమ్మవారి ఆలయంలో అన్ని సౌకర్యాలు భక్తులకు విజయ దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

# వ్యక్తిగత జీవితాలను రాజకీయాల్లోకి లాగొద్దు

### - బాధ్యతగల పదవిలో ఉండి ఇలా మాట్లాడుతారా !

### - మండిపడ్డ భారాస నాయకులు


హైదరాబాద్, (ప్రజా మంటలు):

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నిరాధర ఆరోపణలు చేసిన మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రంగా స్పందించారు. బాధ్యత గల పదవిలో ఉండి బాధ్యతరహితంగా మాట్లాడడం బాధాకరమని ఆమె అన్నారు. ఎక్స్ వేదికగా స్పందించిన సబితా ఇంద్రారెడ్డి.. మీరు చేసిన ఆరోపణ వల్ల కేటీఆర్ గారి అమ్మ, భార్య, బిడ్డ, చెల్లి బాధపడరా? వాళ్లు ఆడబిడ్డలు కారా? ఒక తోటి మహిళగా మీరు ఆలోచించినారా? బాధ్యతగల పదవిలో ఉండి బాధ్యతరహితంగా మాట్లాడటం బాధాకరమని సబిత పేర్కొన్నారు. సురేఖమ్మ, మర్యాద అనేది ఇచ్చిపుచ్చుకోవడంలో ఉంటుంది. కేటీఆర్ గురించి మీరు మాట్లాడింది ఆక్షేపణీయం. రాజకీయాల్లో వ్యక్తిగత ఆరోపణలు చేయకూడదు, తిరిగి ఆస్కారం ఇవ్వకూడదు. వ్యవస్థలో ఉన్న లోటుపాట్ల గురించి మాట్లాడాలి.. సమాజానికి ఆదర్శంగా ఉండాలి అని కొండా సురేఖకు సబితా ఇంద్రారెడ్డి సూచించారు. మరోవైపు బిఆర్ఎస్ మహిళా నేతలు సత్యవతి రాథోడ్,మాలోత్ కవితలు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి వ్యాఖ్యలపై కోర్టుకు ఈడుస్తామని హెచ్చరించారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు తదితర అఘాయిత్యాలపై ఏనాడూ మాట్లాడని మంత్రి కొండా సురేఖ కెటిఆర్‌పై బట్టకాల్చి మీదవేయడం దారుణమని అన్నారు. వెంటనే క్షమాపణలు చెప్పి, వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో సినీ తారల కుటుంబాలను అవమాన పరిచారని అన్నారు. హీరో నాగచైతన్య విడాకులకు కేటీఆరే కారణమని మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ పార్టీ నేత వై సతీశ్ రెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. విడాకులకు కేటీఆర్ కారణమని.. సమంత చెప్పిందా..? నాగచైతన్య చెప్పిండా నీకు..? అని కొండా సురేఖను వైఎస్సార్ సూటిగా ప్రశ్నించారు. మొన్న ఎడ్చిన ఏడ్పు ఈ చిల్లర మాటలు మాట్లాడేటప్పుడు గుర్తు రాలేదా? అని వైఎస్సార్ అడిగారు. ఒక స్త్రీ ని చూస్తే అమ్మ అని అనేలా ఉండాలి కానీ నీ అమ్మ అని అనేలా ఉండకూడదని చెప్పారు. మూసీ ప్రక్షాళన కాదు ముందు మీ నోర్లు ప్రక్షాళన చేసుకోవాలి. నేను ఆడదాన్ని ఏడవొచ్చు, తిట్టొచ్చు, ఏదైనా చేయొచ్చు అనుకుంటే చూస్తూ ఊరుకోరు. మీడియా నన్ను మర్చిపోయింది.. వార్తల్లో ఉండాలి అని ఈ డ్రామాలు చేస్తున్నట్టుంది. మీకున్న పదవి వాడుకొని మంచి పనులు చేసి అటు మీడియాని ఇటు ప్రజలను మెప్పించుకోండి అని వైఎస్సార్ విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే మంత్రి కొండా సురేఖ దొంగ ఏడుపులు.. పెడబొబ్బలు దేనికి..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆమెపై ఎవరు మాట్లాడలేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్ చాట్ చేశారు. ఇదే సోషల్ మీడియాలో మాపైన ట్రోలింగ్ పేరుతో దాడి జరగడం లేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కొండా సురేఖ గతంలో ఉచ్చ ఆగడం లేదా అని అనలేదా..? ఇంకా ఆమె గతంలో మాట్లాడిన బూతు మాటలు గుర్తు తెచ్చుకోవాలి. గతంలో ఇదే కొండా సురేఖ మాట్లాడిన వీడియోలు పంపిస్తా మీకు కావాలంటే.. ఇదే కొండా సురేఖ హీరోయిన్ల ఫోన్లు టాప్ చేశారని కామెంట్లు చేశారు. ఆమె ఆరోపణలు చేసిన వాళ్లు మహిళలు కాదా? వాళ్లకు మనోభావాలు ఉండవా? మాపైన అడ్డగోలు ఆరోపణలు చేసినప్పుడు మా ఇంట్లో ఉన్న మహిళలు బాధపడలేదా? ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలన్నీ మీకు, మంత్రులకు పంపిస్తా.. వెంటనే ముఖ్యమంత్రి నోటిని ఫినాయిల్ వేసి కొండా సురేఖ, మంత్రులు కలిసి కడగాలి అని కేటీఆర్ సూచించారు.

# ప్రాచీన శిల్ప కళకు ప్రతిరూపం శివాలయం శరన్నవరాత్రులకు సిద్ధమైన రామలింగేశ్వర ఆలయం

## అక్టోబర్ 3 నుండి దేవస్థానంలో ఉత్సవాలు







రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

ధర్మపురి అక్టోబర్ 02 (ప్రజామంటలు):

సుప్రసిద్ధ ప్రాచీన పవిత్ర గోదావరీ తీరస్థ తీర్థంగా, పుణ్య క్షేత్రంగా మిగుల ప్రాచుర్యం పొందింది జగిత్యాల జిల్లాలోని ధర్మపురి క్షేత్రం. శ్రీలక్ష్మీనరసింహ, శ్రీరామ లింగేశ్వరస్వాముల దేవాలయాలు, మసీదూ పక్కపక్కనే కలిగి అనాదిగా వైష్ణవ, శైవ, ముస్లిం మత సామరస్యానికి సాక్షీభూతంగా నిలిచియున్న ధర్మపురి క్షేత్రం రాజం. గంభీర గౌతమీనదీ తీరాన వెలసి, అలనాటి శిల్పకళా చాతుర్యానికి ప్రతిబింబమై, ఐతిహాసిక, చారిత్రిక ప్రాధాన్యతను సంతరించుకుని దక్షిణ కాశిగా పేరెన్నిక గనుటకు మూలకారణమైనది ఈక్షేత్రం లోని శ్రీరామచంద్ర స్థాపిత శ్రీరామ లింగేశ్వరాలయం. అక్టోబర్ 3నుండి అక్టోబర్ 12 వరకు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలకు దేవస్థానం పక్షాన రామలింగేశ్వర తత్సంబంధిత ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. భృగుమహర్షి త్రిమూర్తులను పరీక్షించిన నేపథ్యంలో, కైలాస మేగిన సందర్భంలో నిత్యానందంలో మునిగి తేలుతూ ఆ మహర్షి రాకను గమనింపని పార్వతీ పరమేశ్వరులను గాంచిన భృగు మహర్షి, శివుడు లింగ రూపులో ఉంటూ, ఎవరిచేతా పూజింప బడకుండునట్లు శాపమిచ్చెనని పురాణాలు విశదీకరిస్తున్నాయి. తన శాప విముక్తికై పరమ శివుడు, మహా విష్ణువును గురించి ఘోర తపస్సు చేయగా రామావతారంలో, ధర్మపురి క్షేత్రంలో స్వయంగా తాను లింగాన్ని ప్రతిష్ఠించి, పూజించి శాపవిమోచనం కలిగించ గలనని మహా విష్ణువు వరమిచ్చినట్లు స్థానిక పురాణాలు స్పష్ట పరుస్తు న్నాయి. రామావతారంలో దశరథుని ఆజ్ఞానుసారం వనవాస దీక్షలో, దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి క్షేత్రానికి ఏతెంచిన శ్రీరాముడు అలనాటికే వెలసియున్న శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి ఈశాన్యాన సైకత (ఇసుక) లింగాన్ని ప్రతిష్ట చేసినట్లు, శ్రీరామునిచే స్థాపించ బడినందున శ్రీరామలింగేశ్వరుడని నామాంకితుడైనట్లు స్థల పురాణం స్పష్టం చేస్తున్నది. 6వ శతాబ్దంలో స్థాపించబడి, 8వ శతాబ్దాంతం వరకూ వర్ధిల్లిన చాళుక్య రాజుల ప్రాభవంలో పునర్మించబడిన రామేశ్వరాల యంలోని గణేశ విగ్ర హములు అలనాటి శిల్పకళకు అద్దం పడుతున్నాయి. క్రీ.శ.978 నుండి 1140 వరకు పాలించిన కల్యాణి చాళుక్యుల వంశానికి చెందిన విక్రమార్క బిరుదాంకి తుడగు ఆరవ విక్రముని (1076–1126) నాటి శిలాశాసనం ఈ ఆలయంలో ఉంది. ఇందులో ఈ చాళుక్య రాజు "పరమేశ్వర, రణరంగభైరవ, మార్వల భైరవ, సుగంధవారణ, విక్రమాదిత్య" బిరుదులతో ప్రశంసింప బడినాడు.

శాలివాహన శకం 1168 పరాభవ నామ సంవత్సర కాలం నాటి కాకతీయ గణపతి దేవుని శిలా శాసనం రామేశ్వర ఆలయంలో పూర్వపు చాళుక్య స్థంభంపైనే చెక్కబడి ఉంది. గణపతి దేవుడు ఇచటి రామేశ్వర, చండికల అంగ రంగ వైభోగములకు గావించిన కొన్ని దానములు శాసనములలో పేర్కొన బడినవి. ఈ ఆలయంలోని మహిషాసుర మర్ధిని, దక్షిణామూర్తి, సప్తమాతృకల విగ్రహాలు కూడా చాళుక్యుల కాలం నాటివేనని, పురావస్తు శాఖలో శాసన వ్యాఖ్యాతగా పనిచేస్తూ పరమపదించిన ప్రముఖ చారిత్రక పరిశోధకులు, స్థానికులు కీర్తి శేషులు సంగనభట్ల నరహరిశర్మ పరిశోధనల ద్వారా తెలుస్తున్నది. క్రీ.శ.1309లో ఢిల్లీ నేలిన అల్లా. ఉద్దీన్ ఖిల్జీ సేనిని మాలిక్ నాయబ్ కాపూర్, ఇందూరు (నిజా మాబాద్ మీదుగా ధర్మపురి మార్గంలో కాకతీయుల పైకి దండెత్తి వెళ్ళిన సమయంలో క్షేత్రంలోని రామేశ్వర, – నృసింహాలయాలు ధ్వంసం చేయ బడినాయి. క్రీ.శ.1332–1367 మధ్యకాలంలో తెలంగాణ లోని వెలమ వీరుల సాయంతో, ముస్లింల నుండి దాస్య విముక్తి కలిగించిన ముసునూరి కాపయా మాత్యుని పాలనా కాలంలో, పరమహంస పరివ్రాజకాచార్య నారాయణాశ్రమ స్వామి ఉభయ దేవాలయాలకు చేయూతనిచ్చి తిరిగి అర్చనాదులకై కట్టుదిట్టం చేశారు. అబుల్ హసన్ తానాషా (1674–1687) మంత్రియగు మాదోభానూజీ సూర్యప్రకాశరావు మజుందార్ (మాదన్న మంత్రి) ఉభయ ఆలయాల అర్చన సహకరించారు. నాటినుండి స్థానిక దాతలైన విప్రవరుల ఆర్యవైశ్యుల, భక్తుల సహకారంతో పూజ నైవేద్యాలు విధివిదాన కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగిస్తూ, కొంతకాలం క్రితం దేవాలయం దేవాదాయ శాఖ ఆధీనంలోనికి తీసుకోబడింది. ఫలితంగా లక్ష్మీనర సింహ దేవస్థానంలో అంతర్భాగమైంది. మాజీ రాష్ట్ర దేవాదాయ శాఖామాత్యులు జువ్వాడి రత్నాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే శికారి విశ్వనాథం, మాజీ రాష్ట్ర మంత్రి, స్థానిక మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ చొరవతో, వివిధ ట్రస్టుబోర్డు చైర్మన్ల నేతృత్వంలోని ధర్మకర్తల మండలుల కృషితో, దాతల చేయూతతో నిధులను ప్రోగు చేసుకుని ముఖ్యమంత్రి సర్వ శ్రేయోనిధి ద్వారా ప్రత్యేక నిధులు పొంది, దేవాలయ పునరుద్ధరణ, సాలహార నిర్మాణం, అమ్మవారు, నంది, కలశ, నవగ్రహ విగ్రహ ప్రతిష్టలు పూర్తి చేసుకుని, శృంగేరి శంకరాచార్య బహూకృత ఆదిశంకర శారదామాత మూర్తులను ఆలయంలో ప్రతిష్ఠించడం జరిగింది. ఇందారపు రామయ్య నేతృత్వంలోని దేవస్థాన పునరుద్ధరణ కమిటీ ప్రత్యేక కృషితో లక్షలాది నిధులను దాతల ద్వారా సమ కూర్చుకుని పలు మార్పులు చేర్పులతో కనీ వినీ ఎరుగని కొత్త శోభను సంతరించుకుంది. అక్టోబర్ 3 నుంచి నిర్వహించే దసరా నవరాత్రుల సందర్భంగా ఎసి, ఇఓ సంకటాల శ్రీనివాస్ నేతృత్వంలో, అర్చకులు దేవళ్ళ విశ్వనాథశర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ సిబ్బంది ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు గావిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం వలసిన వసతులు, ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, అర్రెమి నాడు సామూహిక కుంకుమార్చనలకు విశేష ఏర్పాట్లు చేశారు.



## బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటంతో పితృఅమావాస్య జరుపుకున్న అభ్యుదయవాది ఆదర్శంగా నిలుస్తున్న రాజేందర్ యాదవ్

ఇబ్రాహీంపట్నం అక్టోబర్ 02 (ప్రజామంటలు):

పితృ దేవతల్ని శ్రాద్ధకర్మాదులతో అర్చించాలని చెప్పే సందర్భాలు పురాణాల్లో చాలా ఉన్నాయి. అసలు పితృదేవతలు ఎవరనే సందేహానికి, ప్రశ్నలకు ఈ కథనం సందర్భం సమాదానమిస్తుంది. ప్రతి మాసంలోనూ వచ్చే అమావాస్య, మహాలయ అమావాస్య అన్నా పితృదేవతలకు ఎంతో ఇష్టమని ఆ రోజు శ్రాద్ధ కర్మాదుల్ని చేస్తే మంచి ఫలితం ఉంటుందని పెద్దలు చెబుతారు. అయితే ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన దళిత బహుజనవాది రెబ్బటి రాజేందర్ యాదవ్ మహాలయ అమావాస్య బుధవారం పితృ దేవతలకు చేసుకున్న పండగ విజ్ఞులను ఆలోచింపజేస్తుంది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆయన జీవించిన కాలమంతా అట్టడుగు అణగారిన కులాల అభ్యున్నతికి తన శక్తినంతా దారబోసి చివరికి వారి అభ్యున్నతి ధ్యాసలో తన కుటుంబ సభ్యులను కూడా కోల్పోయిన మహనీయుడు మనకు ఎట్లా పితృదేవుడు కాకుండా పోతాడాని మదిలో అంతర్మదనపడి నేటి మహాలయ అమవాస్యరోజు అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టుకొని పితృదేవునిగా తలచి శ్రద్ధాకర్మాదులతో పండుగ చేసుకోవడం గ్రామంలో కొంత చర్చనీయాంశం అయింది. ఇబ్రహీంపట్నం యాదవ మండల అధ్యక్షులు రెబ్బటి రాజేందర్ యాదవ్ నేడు ఆచరించిన మహాలయ మవాస్య పండగ తీరుపట్ల గ్రామ పెద్దలు, అభ్యుదయవాదులు, అట్టడుగు అణగారిన కులాల ఉద్యమకారులు, సామాజిక మార్పు కోరే ప్రతి ఒక్కరు అభినందిస్తూ ఉన్నారు.



## గాంధీ జయంతి సందర్భంగా ఎల్కతుర్తి లో గ్రామసభ నిర్వహణ

ఎల్కతుర్తి అక్టోబర్ 02 (ప్రజామంటలు):

మహాత్మా గాంధీ ఉపాధి హామీ 2024–2025 పనుల అంచన కోసం ఎల్కతుర్తి గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. శ్రీనివాస రావు మాటాడుతూ.... గ్రామంలో ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంచనా ప్రణాళిక సిద్ధం చెయ్యాలని అపో అనిత ని ఆదేశించారు. స్వచ్ఛత హీ సేవ లో భాగంగా 17/09/2024 నుండి నేటి వరకు గ్రామ పంచాయతీ సిబ్బంది అహర్నిశలు శ్రమించి పరిశుభ్రత పరిరక్షణ కోసం నిత్యం పనులు చేస్తున్నందున వారికి (ఎంపిడిఓ) ప్రత్యేక అధికారి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ అడిషనల్ పి.డి. శ్రీనివాస్ రావు, స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ విజయ్ కుమార్, అపో అనిత, శ్రీకాంత్, పంచాయతీ సెక్రెటరీ వి. శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, ఉపాధి హామీ కూలీలు, స్వయం సహాయక బృందాలు, పారిశుధ్య సిబ్బంది, గ్రామస్తులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామంలో శ్రీమన్ నంబి నృసింహచార్యులు కౌశిక జగిత్యాల, శ్రీ వన దుర్గా సేవా సమితి వారి ఆధ్వర్యంలో శ్రీ వనదుర్గ మొదటి సంవత్సర శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని ఎమ్మెల్యే స్వగృహంలో ఆవిష్కరించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. పాల్గొన్న హస్నాబాద్ గ్రామ ప్రజలు, యువత, తదితరులు

## మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ

జగిత్యాల అక్టోబర్ 02 (ప్రజామంటలు):




9వ వార్డులో మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ , చైర్మన్ అడు వాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ....కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తం గా స్వచ్ఛ తా హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తూన్నాయి. స్వచ్ఛత కార్యక్రమం నిరంతర ప్రక్రియ. వరద ప్రమాద ప్రాంతాలకు జగిత్యాల జిల్లా కి 3 కోట్ల నిధులు మంజూరు చేయటం జరిగింది. అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అధికారులు పారదర్శకంగా పట్టణానికి వచ్చిన 50 లక్షల ఎఫ్ డి ఆర్ నిధులు కేటాయించాలని కోరుతున్నా. బతుకమ్మ సంబరాలు కూడా ప్రారంభం అవుతున్నాయి అని, జగిత్యాల పురపాలక సంఘం అన్ని వార్డులలో పారిశుధ్యం, స్వచ్ఛత,రోడ్ల మరమ్మత్తులు చేయాలని అన్నారు. జగిత్యాల పట్టణం పరిశుభ్రం గా ఉండాలంటే ప్రజల సహాకారం తప్పని సరి అన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి, పచ్చ ధనాన్ని పెంచాలనీ అన్నారు. పార్కుల సంరక్షణ అధికారులతో పాటు, స్థానిక ప్రజలది కూడా అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చుడాల్సిన భాధ్యత అందరి పైనా ఉందన్నారు. అందరూ సమిష్టిగా జాతిపిత మహాత్మ గాంధీ కళలను సాకారం చేద్దాం అన్నారు ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో కమీషనర్ సమ్మయ్య, వైస్ ఛైర్మెన్ గొలి శ్రీనివాస్, కౌన్సిలర్ వొద్ది శ్రీలత రామ్మోహన్ రావు, కౌన్సిలర్ కూసరి అనిల్ నాయకులు ఆరుముళ్ళ పవన్, పెండెం రాములు, హనుమంతరావు, ప్రభాకర్ రెడ్డి, బింగి రాజేశం, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ పట్టణంలోని టవర్ సర్కిల్ సాయి నగర్ వీధిలో ఎంగిలి పూల బతుకమ్మతో లక్ష్మీప్రసన్న, కాత్య, తపస్య, అన్వ్యా



జగిత్యాల పట్టణంలోని గాంధీ నగర్ మంచినీటి బావి వాడలో గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. మున్సిపల్ చైర్ పర్సన్. పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్స్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్స్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు



జనగామ పట్టణంలోని 27వ వార్డు రెడ్డి వీధిలో ఎంగిలి పూల బతుకమ్మ ఆడుతున్న దృశ్యం

# ధీరోధాత్తుడు రామానందతీర్థ




## అక్టోబర్ 3... బహుముఖ ప్రజ్ఞుని జన్మదినం



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

స్వామి రామానంద తీర్థ (అక్టోబర్ 3, 1903 - జనవరి 22, 1972) స్వాతంత్ర్య సమర యోధుడు, హైదరాబాద్ సంస్థాన విమోచ నానికి పాటు పడిన మహా నాయకుడు, భారత పార్లమెంట్ సభ్యుడు, సన్యాసి, కార్మిక నాయకుడు, విద్యావేత్త.

ఆయన అసలు పేరు వెంకటరావు ఖేడ్గీకర్. తండ్రి భావూరావు, తల్లి యసుబాయి.1903 అక్టోబరు 3వ తేదీన అప్పటి హైదరాబాదు సంస్థానంలోని గుల్బర్గా జిల్లా, ఝువర్గీ తాలూకా సింధ్గీ గ్రామంలో ఆయన జన్మించారు. ఆయన తండ్రి సన్యాసం స్వీకరించటంతో బంధువుల ఔదార్యంతో తన విద్యాభ్యాసాన్ని సాగించ వలసి వచ్చింది. లోకమాన్య బాల గంగాధర తిలక్‌ను ఆయన ఆదర్శంగా తీసుకున్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థిగా ఉండగానే 1920 జూలై 31 వ తేదీ రాత్రి లోకమాన్య బాలగంగాధర తిలక్ కాలధర్మం చెందారన్న వార్త విని బ్రహ్మచారిగా తన జీవితాన్నంతా మాతృభూమి సేవకే అంకితం చేయగలను అని ప్రతిజ్ఞ చేసి, ఆ ప్రకారమే ఉండి పోయిన ధీరోధాత్తుడు ఆయన. గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని బడికి గాంధీ టోపి వేసుకుని వెళ్ళి తన నిరసన తెలిపి కొంత కాలం చదువుకు సెలవిచ్చారు. తరవాత పూనాలోని తిలక్ విద్యాపీఠ్‌లో మూడేళ్ళు అధ్యయనం చేసి, ప్రజాస్వామ్యం, దాని క్రమాభివృద్ధి అనే అంశంపై సిద్ధాంత వ్యాసం రాసి పూనా విశ్వ విద్యాలయానికి సమర్పించి ఎం.ఏ పట్టాని పొందారు. కొంత కాలం ప్రసిద్ధ కార్మిక నాయకుడు ఎన్ ఎం జోషి కార్మికోద్యమంలో పాల్గొన్నారు. 1926 లో ఢిల్లీలో ఉండగా పాక్షిక పక్షవాతానికి గురై కొంత కాలానికి కోలుకున్నారు. తన ఆరోగ్య పరిమితి దృష్ట్యా జోషి అనుమతితో కార్మికోద్యమానికి స్వస్తి చెప్పి ఒస్మానాబాద్ స్కూల్ లో ప్రధానోపాధ్యాయుడిగా చేరారు. ఈ దరిమిలా హైదరాబాదు రాష్ట్రంలో హిందువులపై జరుపుతున్న దుశ్చర్యలు, ఆంక్షల గురించి తెలుసు కున్నారు. అప్పటి ప్రభుత్వం, హిందూ ఉన్నత పాఠశాల స్థాపనకు నిరాకరించింది. ఐతే ఓ లొసుగును ఉపయోగించుకుని ప్రాథమిక పాఠశాలను విస్తరించి ఉన్నత పాఠశాల నెలకొల్పారు. ఆ స్కూల్ ప్రప్రథమ ప్రధానోపాధ్యాయుడిగా రామానంద తీర్థను నియమించడం జరిగింది. హిప్పర్గి పాఠశాల ప్రధానోపాధ్యాయులై, ఆరు సంవత్సరాల పాటు ఆ విద్యా సంస్థను గురుకుల పద్ధతిపై చక్కగా ఆయన నిర్వహించారు. మరాఠ్వాడాలో ఉస్మానాబాదు జిల్లాలోని 1932లో స్వామి నారాయణ అనే గురువు ఆయనకు 'విద్వత్ సన్యాసం' అనే పద్ధతి ప్రకారం సన్యాస దీక్ష ఇచ్చి, 'స్వామీ రామానంద తీర్థ' అని నామకరణం చేశారు. 1938లో రాజకీయ రంగంలోకి ప్రవేశించి ఆయన మహారాష్ట్ర పరిషత్తుకు కార్యదర్శిగా పనిచేసి, ఆ సంవత్సరమే తన నివాసాన్ని మోమినాబాదు నుంచి హైదరాబాదుకు ఆయన మార్చారు. నిజాం సంస్థానంలో ఆనాడు ఎవరూ పాలనా సంస్కరణల్ని కోరినా నవాబులు దానిని మతపరమైన అంశంగా చిత్రీకరించే వారు. దాంతో మత ప్రమేయం లేని ఒక రాజకీయ సంస్థ ఆవిర్భావం ఆవశ్యకమైంది. ఆ అవసరాన్ని తీరుస్తూ వెలిసిందే 'హైదరా బాద్ స్టేట్ కాంగ్రెస్. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ అవసరాన్ని తొలిసారి గుర్తించింది స్వామి రామానంద తీర్థ. ఆయనే సంస్థ స్థాపనకు ప్రధాన కారకులు. 1938, సెప్టెంబర్ 8న ఒక మహాజన సభ సమావేశాన్ని జరిపి అందులో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించారు. కానీ, ఈ సమావేశ ముందు రోజు 1938, సెప్టెంబర్ 8న అప్పటి హైదరాబాద్, ప్రధాని సర్ అక్బర్ హైదర్ ఈ సంస్థను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ సందర్శన చేశారు. అలా హైదరాబాద్ సంస్థానంలోనే కాదు... బహుశా దేశంలోనే ఆవిర్భావానికి ముందే నిషేధానికి గురైన సంస్థగా హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నిలిచింది. బూర్గుల రామకృష్ణా రావు హైదరాబాద్ స్టేట్ స్టేట్ కాం కాంగ్రెస్ మత సంస్థ కాదని ప్రభుత్వానికి తెలియజేస్తూ చర్చలు నిర్వ రాయబారం హించారు. ఈ

నేపథ్యంలో అహింసాయుత సత్యాగ్రహం ద్వారా మాత్రమే నిషేధాజ్ఞల్ని తొలిగింప చేసు కోవాలని కాంగ్రెస్ ప్రతినిధులు భావించారు. 1938 అక్టోబర్ లో సత్యాగ్రహం ప్రారంభమైంది. ఆ సంవత్సరం అక్టోబర్ 24న రావి నారాయణరెడ్డి, రామకృష్ణ దూత్, జనార్ధనరావు దేశాయ్, గోవిందరావు నానక్ కలిసి స్వామి రామానంద తీర్థ నేతృత్వంలో సత్యాగ్రహం చేశారు. వీరిలో సత్యాగ్రహం ఉద్యమ మొదటి డిక్టేటర్ (సర్వాధికారి) రామానంద తీర్థ కావడం గమనార్హం. ఈ క్రమంలో స్వామి రామానంద తీర్థను హైదరా బాదులో 1938 అక్టోబరు 27వ తేదీన ప్రభుత్వం బంధించి, 18 నెలలు కఠిన శిక్షకు గురి చేశారు. నిషేధం తొలగించని కారణంగా, తాను వ్యక్తిగత సత్యాగ్రహం చేస్తానని స్వామీజీ అప్పటి హైదరాబాద్ నిజాం ప్రభుత్వానికి తెలియ చేయగా, 1940 సెప్టెంబర్ 11 వ తేదీన ఆయనను బంధించి, ప్రజారక్షణ నిబంధనల క్రింద నిజామాబాద్ కారాగారంలో నిర్బంధంలో ఉంచారు. 1942-1950 సంవత్సరాల మధ్య హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు. దేశీయ సంస్థానాల మహాసభ కార్య నిర్వాహక వర్గ సభ్యులుగా ఉన్నారు. 1942 ఆగస్ట్‌లో క్విట్ ఇండియా ఉద్యమ తీర్మానం ఆమోదింప బడిన బొంబాయి కాంగ్రెస్ సభలో పాల్గొని షోలాపూర్ నుంచి తిరిగి రాగానే ఆయనను నిజాం ప్రభుత్వం బంధించి1943 డిసెంబరులో విడుదల చేసింది. హైదరాబాదు సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలని ఉద్యమాన్ని ప్రారంభించి నందుకు ఆయనను 1948 జనవరిలో బంధించి, అనేక జైళ్ళల్లో ఉంచారు. నిజాం సైన్యం భారత ప్రభుత్వ సైన్యానికి లొంగిపోయిన 1948 సెప్టెంబర్ 17వ తేదీన రామానంద తీర్థ స్వామి నిర్బంధం నుండి విడుదల పొందారు. రామానంద తీర్థ నాందేడ్‌లోని పీపుల్స్ కాలేజి వ్యవస్థాపకులు. హైదరాబాదు ఖాదీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు. హైదరాబాదు హిందీ ప్రచార సంఘానికి అధ్యక్షులు, 1952లో హైదరాబాదు కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులుగాను ఆయన పని చేశారు. 1952 నుండి 1962 వరకు లోకసభ సభ్యులుగా ఉన్నారు.1953లో హైదరాబాదు నగరంలో ప్రప్రథమంగా జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహా సభకు స్వామీజీ ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా వ్యవహరించారు. హైదరాబాదు సంస్థానాన్ని భాషా ప్రాతిపదికపై విభజించాలని 1953లోనే గట్టిగా కోరిన స్వామీజీ ఎనిమిది తెలంగాణ జిల్లాలను మద్రాసు రాష్ట్రం నుండి విడిపడ్డ ఆంధ్ర ప్రాంతంలో కలిపేసి తెలుగు ప్రజల చిరకాల వాంఛయైన విశాలాంధ్రను ఏర్పాటు చేయాలని ఒక ప్రకటన చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఆయన ఆంధ్రప్రదేశ్ పౌరుడుగానే హైదరాబాదులో నివాసం ఏర్పరుచు కొన్నారు.1957 నుండి ఆయన ఉస్మానియా సెనేట్‌లో శాశ్వత సభ్యులుగా కొంతకాలం ఉన్నారు. వినోభాజీ ప్రారంభించిన భూదాన్ ఉద్యమాలకు ఆయన చేయూత నిచ్చారు. స్వామీజి 1972 జనవరి 22 వ తేదీన హైదరా బాదులో నిర్యాణం చెందారు. రామానంద తీర్థ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేశారు.

# దేశ రాజధానిలో భారీ డ్రగ్స్ పట్టివేత

## - రూ.2 వేల కోట్లు విలువైన కొకైన్ స్వాధీనం

న్యూఢిల్లీ, (ప్రజామంటలు): దేశ రాజధాని నగరం ఢిల్లీలో భారీగా డ్రగ్స్ బయటపడటం కలకలం రేపుతోంది. దాదాపు 500 కిలోలకు పైగా కొకైన్‌ను ఢిల్లీ పోలీసులు సీజ్ చేశారు. వీటి విలువ రూ. 2వేల కోట్లు ఉంటుందని అంచనా.సౌత్ ఢిల్లీలో సోదాలు జరిపిన పోలీసులు ఈ భారీ డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న నలుగురిని అరెస్టు చేశారు. ఈ భారీ కొకైన్ తరలింపు వెనుక అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ సిండికేట్ హస్తం ఉందని అనుమానిస్తున్నారు.ఇటీవల ఢిల్లీలోని తిలక్ నగర్ ప్రాంతంలో 400 గ్రాముల హెరాయిన్, 160 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరు ఆఫ్గన్ పౌరులను అరెస్టు చేసిన తర్వాత ఈ భారీ మాదకద్రవ్యాల రాకెట్‌ను ఛేదించడం గమనార్హం.

## వ్యాసకర్తలకు వినతి

రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.

mantalukathalu@gmail.com -ఎడిటర్

# తెలంగాణలో గత్తర్ లేపుతున్న రాజకీయ విమర్శలు



రాజకీయాలు హుందాగా, ప్రజామోదం పొందేలా ఉండాలి. విమర్శ కేవలం పాలన పరమైన నిర్ణయాలకే పరిమితమయ్యేది. ప్రజల్లో రాజకీయం అంటే సదభిప్రాయం ఉండేది. నాయకులు కూడా తమ పరిధి దాటకుండా హుందాగా నడుచుకునే వారు. కానీ ప్రస్తుతం నాయకులు సహనం కోల్పోతున్నారు. ఎక్కడ అధికారం చేజారుతుందోనని పాలక పక్షం, అధికారమే లక్ష్యంగా ప్రతిపక్షం తిట్ల దండకాన్ని ఎంచుకుంటున్నారు. విమర్శ వికృత రూపం దాలుస్తోంది.

కాలు జారితే ఫర్వాలేదు. కొన్నాళ్లకైనా గాయం మానుతుంది. నోరు జారితే వెనక్కి తీసుకోలేం. మనసు గాయాలు గతించిపోవు. విమర్శలు, ఆరోపణల స్థాయి దాటి రాజకీయాలు తిట్లు,బూతు పురాణాల స్థాయికి దిగజారిపోయాయి. ప్రత్యర్థి పార్టీలు, నాయకులపై పెరుగుతున్న అసహనం ప్రజాస్వామ్యాన్ని పట్టి పీడిస్తోంది. ఎదుటి పక్షాన్ని బొంద పెట్టేయాలన్నంత కసి నాయకుల్లో ఎందుకు ఏర్పడుతుందో ఎవరికీ అర్థం కాదు. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ఈ రోజు అధికార పక్షంలో ఉన్నవాళ్లు రేపు ప్రతిపక్షంలోకి చేరతారు. మళ్లీ అయిదేళ్లు, పదేళ్లకు పాత్రలు మారుతుంటాయి. ప్రజాభిమానానికి కొలబద్దలుగా ఎన్నికలను చూడాల్సి ఉంటుంది. తమ పనితీరు, ఎదుటి వాళ్ల తప్పులను ఎత్తి చూపడం ద్వారా అభిమానాన్ని కూడ గట్టుకోవాలి. ప్రత్యామ్నాయ అజెండాను ఆవిష్కరించి ప్రజాకర్షణను చేజిక్కించుకోవాలి. ఇందులో భాగంగా అనేక రకాల ఎత్తుగడలు, వ్యూహాలు, ప్రచార కార్యక్రమాలు తీసుకొంటూ ఉండాలి.

నేతలు ఇరువురు ఒకరిపై ఒకరి చేసుకున్న విమర్శలు, వీడియోలు, వార్తల రూపంలో ఆయా గ్రూపులలో ఉన్నప్పటికీని వారి వారి అనుచరులు, సామాజిక మాధ్యమాల నిర్వాహకులు చేసే విమర్శలు దారుణంగా ఉంటున్నాయి.

సాధించేవాడికి సహనం ఉండాలి. అదే గాంధీజి నేర్పిన పాఠం. ఆ సహన గుణం కొంతమందికే సొంతం అవడం దురదృష్ట కరం.

ఒక నాయకుడు మరొక నాయకుడిపై విమర్శలు, ఆరోపణలు చేస్తుంటారు. విమర్శకు ప్రతి విమర్శ వెంట వెంటనే చేసుకుంటారు.


విమర్శలు,ప్రతి విమర్శలు, అభివృద్ధిపై సవాల్ చేసుకోవడం వరకు పరిమితం అయితే ఎవరికీ ఇబ్బంది ఉండదు. వాటిని ప్రజలకు చెప్పే ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా కు కూడా ఎలాంటి ఇబ్బందులు రావు.

తట్టుకోలేని అక్కసుతో నోటికొచ్చిన పద్ధతిలో మాట్లాడేస్తున్నారు. క్షణ క్షణం సంచలనాల కోసం వెంపర్లాడే మీడియా పదే పదే వాటిని చూపిస్తూ ఆయా నాయకులను బజారున పడేస్తోంది. ఆయా పార్టీలకు చేకూరుతున్న లబ్ధి సంగతేమో కానీ అసభ్య పదజాలంతో తిట్లాటకు దిగిన నాయకులు మాత్రం ప్రజల్లో పలచనయిపోతున్నారు. దేశంలో మిగిలిన రాష్ట్రాల కంటే కూడా మన వద్దే ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది.

నాయకులు తమ ప్రవర్తన ద్వారా మాత్రమే కాకుండా వారి భాష ద్వారా కూడా చూపిస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా ఇలాంటి పదజాలాన్ని దూషిస్తూ మాట్లాడితే తప్పులేదు.

ప్రస్తుతం సామాజిక, రాజకీయ తారలపై అనుచిత పదజాలం ఉపయోగించడం ట్రెండ్‌గా మారింది. కొన్నిసార్లు సోషల్ మీడియాలో వ్రాసే వ్యాఖ్యలలో ఉపయోగించే భాష స్థాయి చాలా తక్కువగా ఉంటుంది.

అధికార పార్టీలు, ప్రతిపక్షాలు అనే తేడా లేకుండా అన్ని పార్టీల నాయకులు భాషా పరిమితులను ఉల్లంఘిస్తూ జాతీయ పదవుల గౌరవాన్ని చాలా చౌకగా చేస్తున్నారు. ఈ పరుష భాష అవసరం ఒక్కసారిగా నాయకుల్లో ఎందుకు మొదలైందన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇది జనాదరణ పొందాలనే సత్వరమార్గ ఆశయం కావచ్చు లేదా ఒకరి స్వంత అసమర్థతను దాచిపెట్టడానికి ప్రయత్నించే




నిరాశావాదం కావచ్చు.

ఎవ్వరూ ఎవరికంటే తక్కువ వారుగా కనిపించరు. అందరూ ఒకరి కంటే ఒకరు గొప్పవారు, పార్లమెంటు గౌరవం మాత్రమే తగ్గిపోతుంది. రాజ్యాంగం యొక్క సార్వభౌమాదికారం మాత్రమే దెబ్బ తింటుంది మరియు తెలంగాణ రాష్ట్రం, భారతదేశం యొక్క తల దించుకోవాల్సి వస్తుంది.

అసభ్యత చాలా ప్రభావవంతంగా మారింది, ఆదర్శవాదం యొక్క ఈ చర్చలు ఎగతాళిగా కనిపించడం ప్రారంభించాయి.

పదవులకు సంబంధించిన గౌరవాలు ఏమిటి? అనుచిత ప్రకటనల వల్ల అందరూ గాయపడుతున్నారు కానీ ఆత్మపరిశీలన చేసుకోవడానికి ఎవరూ సిద్ధంగా లేరు.

ద్వేషపూరిత ప్రసంగాల చక్రం నుండి కోలుకోవడంలో మార్పు కనిపించడం లేదు, దీనిలో ఆరోపణలు మరియు ప్రత్యారోపణల రౌండ్లు తెలంగాణ రాజకీయాలు అసభ్య పదజాలంతో చిక్కుకున్నాయి.

భాషా పై గౌరవం అంటే కన్న తల్లిపై గౌరవంగా మెదులుతూ మాట పదిలమైతే ఓటు కూడా పదిలంగా ఉంటుందన్న రాజకీయ సత్యాన్ని గ్రహించడం నేటి నేతలకు ఎంతైనా అవసరం.

సిరిసిల్ల. రాజా విక్రాంత్ శర్మ..
9963349493.

# నేటినుంచే బతుకమ్మ సంబరాలు

నిజామాబాద్,అక్టోబర్ 2 (ప్రజామంటలు): తెలంగాణలో బతుకమ్మ వేడుకలు ప్రారంభ మయ్యాయి. ఉదయమే సందడి మొదల య్యింది. ఊరూవాడా బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించారు. ఎంగిలిపూల బతుకమమగా నేడు ప్రారంభం అయ్యింది. దీనినే ఎంగిలిపూలబతుకమ్మ అని కూడా పలుచోట్ల పిలుస్తారు. గురువారం నుంచి 9 రోజులపాటు 9 నైవేద్యాలతో ఈ బతుకమ్మ సందడి నెలకొంటుంది. 9 రోజులపాటు రోజుకు ఒక రకమైన నైవేద్యాన్ని బతుకమ్మకు సమర్పిస్తారు. మొక్కజన్నలు, జొన్నలు, సజ్జలు, మినుములు, శనగలు, పెసర్లు, పల్లీలు, నువ్వులు, గోధుమలు, బియ్యం, కాజు, బెల్లం, పాలు తొమ్మిది రోజులు బతుకమ్మకు నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయం. మొదటి ఎనిమిది రోజులు ఈ నైవేద్యం తయారీలో యువకులు, యువతులు పాల్గొంటారు. కానీ చివరి రోజు అయిన సద్దుల బతుకమ్మ నాడు మాత్రం నైవేద్యాన్ని మహిళలే తయారుచేస్తారు.

1. ఎంగిలి పూల బతుకమ్మ,
2. అటుకుల బతుకమ్మ,
3. ముద్దపప్పు బతుకమ్మ,
4. నానే బియ్యం బతుకమ్మ,
5. అట్ల బతుకమ్మ,
6. అలిగిన బతుకమ్మ,
7. వేపకాయల బతుకమ్మ,
8. వెన్నముద్దల బతుకమ్మ,
9. సద్దుల బతుకమ్మ,

తొమ్మిది రోజులపాటు బతుకమ్మను పూజించిన మహిళలు చివరి రోజైన సద్దుల బతుకమ్మ నాడు చెరువులో నిమజ్జనం చేస్తారు.

# ఇంకెంతకాలం పర్యావరణ విధ్వంసం

ప్రకృతి విధ్వంసం వల్ల వాతావరణ విపరీత ధోరణులు కానవస్తున్నాయి. వరదలు పంటలను, ప్రజలను నష్టాలపాల్జేశాయి. ఖరీఫ్ సీజనులో వ్యవసాయం సాగేందుకు వీలుగా సమతుల్య వానలు పడాల్సి ఉండగా దేశంలో ఒక ప్రాంతంలో కరువు, మరో ప్రాంతంలో సాధారణ స్థాయి కంటే కొన్ని రెట్ల అధిక వర్షాలు పడటం పర్యావరణ సమస్య తీవ్రతకు సంకేతం. గతేడాదితో పోలిస్తే ఈ యేడు వర్షాలు అధికంగానే కురిసాయి. అత్యధిక వర్షపాతం నమోదయినా ఎక్కడా వాననీటి నిల్వలజాడ కానరావడం లేదు. జలశక్తి అభియాన్ పేరుతో అధికారులు పర్యటనలు చేస్తున్నా ఎక్కడా వాటి ఫలితాలు కానరావడం లేదు. నీటి సంరక్షణపై పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడంతో పాటు, అమలు చేయాలన్న లక్ష్యం కానరావడం లేదు. దీనికితోడు ఇటీవల వరదలు దేశవ్యాప్తగా అతలాకుతలం చేశాయి. అయినా వరదల్లో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నా పట్టించుకోలేదు. ఎపి, తెలంగాణలో పలుప్రాంతాలతో పాటు ఉత్తరాదిలో వరదలు ముంచెత్తాయి. కేళ వయనాడ్ అతలాకుతలం అయ్యింది. బీహార్ రాజధాని పాట్నా కూడా వరదనీటిలో మునిగిపోయింది. వరదలు వస్తే తక్షణ చర్యలు తీసుకునే అవకావం లేకుండా పోయింది. నగరాలతో పాటు, సమీప ప్రాంతాల్లో ఉన్నచెరువులను కుంటలను ఆక్రమించుకున్న కారణంగా కుండపోత వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. ప్రధానంగా ఇటీవల సాయంత్రం కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ నగరవాసులు వణికి పోతున్నారు. క్యూములోనింబస్ మేఘాలతో పలు ప్రాంతాల్లో కుండపోత వాన కురిసిందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. కేవలం గంట పాటు కురిసిన భారీవర్షానికే రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై భారీగా వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడడం ఇప్పుడు పట్టణవాసులకు షరా మామూలయ్యింది. క్యుములోనింబస్ మేఘాలకు తోడు ఉపరిత ఆవర్తనం కారణంగా దేశవ్యాప్తంగా జోరు వానలు పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోనే చూసుకుంటే రాయలసీమ, నెల్లూరు తీవ్ర వర్షాభావం ఎదుర్కొంటున్నాయి. భారీ వర్షాలు, వరదల వలన కలిగే నష్టాలు విషాదకరం. నదీ ప్రవాహాలను సమర్ధవంతంగా నియంత్రించి నీటిని ఒడిసిపట్టే బదులు పర్యావరణ నిబంధనలను ప్రభుత్వమే ఉల్లంఘించి వరదనీటి ప్రవాహాలు అదుపు తప్పేందుకు కారణభూతమవుతోంది. దీర్ఘకాలంలో పర్యావరణానికి చేటు కలిగిస్తున్న మానవ తప్పిదాలు ఊహించని ఉత్పాతాలకు కారణం కావడం మిక్కిలి ఆందోళనకరం. పర్యావరణ, సంస్కృతి, జీవ వైవిధ్యాల పరంగా ప్రాశస్త్యం కలిగిన పశ్చిమ కనుమలు రాను రాను ప్రమాద భరితంగా తయారవడానికి దోపిడీతో కూడిన మానవ తప్పిదాలే కారణమని పర్యావరణ వేత్తలు నెత్తీనోరూ మొత్తుకుంటున్నారు. మితిమీరిన గనుల, క్వారీల తవ్వకాలు, అడవుల విధ్వంసం, పట్టణీకరణ, అటవీ భూములను అటవేతర పనులకు మార్పు చేయడం, నదులు, నదీ ప్రవాహ ప్రాంతాలకు అడ్డంగా పక్కా నిర్మాణాల వంటివి పశ్చిమ కనుమలను విధ్వంసం చేస్తున్నాయి. కేరళ, తమిళనాడు, గోవా, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ పశ్చిమ కనుమల్లో భాగం. కేరళ మహోగ్ర వరదలతో సహా ప్రస్తుత జల విపత్తుల వరకు అన్నీ పడమటి కనుమల్లోనే సంభవిస్తుండటాన్ని బట్టి చూస్తే పర్యావరణవేత్తల ఆందోళనలు వాస్తవిక రూపం దాల్చుతున్నాయని భావించాల్సి ఉంటుంది. 2013లో ఉత్తరాఖండ్‌ను అకస్మిక వరదలు ముంచెత్తినప్పుడు నదులపై ఇబ్బడిముబ్బడిగా నెలకొల్పిన జల విద్యుత్ ప్రాజెక్టులు నదుల ప్రవాహాన్ని ఆటంకపర్చి చుట్టుపక్కనున్న ప్రాంతాలను ముంచెత్తాయని కనుగొన్నారు. కానీ ఎలాంటి చర్యలూ నేటికీ చేపట్టలేదు. మళ్లీ ఎప్పుడైనా వరదలొచ్చినప్పుడు మాత్రమే అలాంటి అక్రమాల గురించి చర్చకొస్తాయి. ప్రభుత్వాలకు ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం అబ్బినందున ప్రజలకు కష్టనష్టాలు తప్పట్లేదు. మొత్తంగా వరదలకు దేశంలోని దక్షిణ, పశ్చిమ ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలు, వరదల ఉధృతికి కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్,బీహార్‌లు జలదిగ్భంధంలో చిక్కుకున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో జనజీవనం అస్తవ్యస్త మవుతోంది. లక్షలాది మందిని సహాయ శిబిరాలకు తరలించాల్సి వస్తోంది. ఇటీవల ఎపి, తెలంగాణలో బుడమేరు, మున్నేరు మునగడంతో నష్టం అపారంగా జరిగింది. కొన్ని రోజుల పాటు విజయవాడ, ఖమ్మం ప్రాంతాలు జలదిగ్బంధం నుంచి బయటపడలేదు. లక్షలాది ఎకరాల్లో పంటలకు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు అపార నష్టం వాటిల్లింది. ఆర్థిక నగరం ముంబయి ఈ నెల రోజుల్లో మూడు తడవలు ముంపునకు గురైంది. ఉత్తరాఖండ్‌లో నదులు పొంగి పొర్లాయి. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వానలకు గోదావరి ఉప్పొంగి మన దగ్గర ఉభయ గోదావరి జిల్లాల్లోని లంక, ఏజెన్సీ గ్రామాలు నీటి ముంపునకు గురయ్యాయి. ఈ అనుభవాలు గుణపాఠాలు కావాలి. ఎందుకు ఇలా జరిగింతో గుర్తించాలి. నదులను, కాలువలను ఆక్రమించడం ఆనవాయితీగా మారింది. వాటిని తొలగించాల్సిందే. లేకుంటే భవిష్యతం మరింత దుర్భరం కాగలదు. నదులు, కాలువలను ఆక్రమించకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. మూసీ రోణకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను విపక్ష బిఆర్ఎస్ తప్పుపట్టడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి వాటి విషయాల్లో కఠిన చర్యలు తీసుకోవాలి. పర్యావరణ విధ్వంసం జరగకుండా చూడాలి. అప్పుడే వరదల నుంచి ముప్పు తప్పగలదు.



## జనగామలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు

జనగామ అక్టోబర్ 02 (ప్రజామంటలు):

జనగామ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త, గంగిశెట్టి ప్రమోద్, బిజ్జాల నవీన్, పజ్జురి గోపయ్య, పోకల లింగయ్య, గట్టు వెంకటేశ్వర్లు, రామిని శివుడు, శర్మిరాల ఉపేందర్, బెలిదే శ్రీధర్, బెజగం బిక్షపతి, లగిశెట్టి వీరలింగం, శివరామకృష్ణ జైన వెంకటరమణ ఐత శ్రీనివాసులు, ముప్పారపు రాములు, గట్టు అమర్నాథ్, పోకల వెంకటేశ్వర్లు, గట్టు శ్రీనివాస్, లగిసెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ మెట్రో స్టేషన్ వద్ద గుర్తు తెలియని డెడ్ బాడీ

సికింద్రాబాద్ అక్టోబర్ 02 ( ప్రజామంటలు):



గాంధీ ఆస్పత్రి మెట్రో స్టేషన్ వద్ద ఓ గుర్తు తెలియని డెడ్ బాడీని సిబ్బంది గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కానీ డెడ్ బాడీ వద్ద ఎలాంటి వివరాలు లేకపోవడంతో పోలీసులు డెడ్ బాడీని గాంధీ మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఫోటోలోని వ్యక్తిని గుర్తుపట్టినవారు చిలకలగూడ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని ఎస్సై ఆంజనేయులు కోరారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 02 (ప్రజామంటలు):

ఇబ్రహీంపట్నం మండల కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.... తెల్ల దొరలను మన దేశం నుండి వెళ్లగొట్టడానికి తనవంతుగా ఎంతో కష్టపడి హింస మార్గం లో నడవకుండా అందరూ అహింస మార్గంలో నడవాలని దేశానికి చాటి చెప్పిన మన జాతి పీత మహాత్మగాంధీ అని వారి గురించి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి, ఎస్సి సెల్ అధ్యక్షులు దుదిగం గంగాధర్, మరియు డైరెక్టర్ లు తిపిరి అశోక్ కుమార్, దమేరా శ్రీనివాస్, రాగుల గణేష్, జేసీబీ శంకర్, భూక్య రాజేందర్, రాజు, నాయకులు వాల్గొట్ నరేష్, కాస సంజీవ్, జలేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎంగిలిపూల బతుకమ్మ ఆటకు సిద్ధమై బయలుదేరిన ఆడపడుచులు

ఎల్కతుర్తి అక్టోబర్ 02 (ప్రజామంటలు):

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని హనుమాన్ టెంపుల్ వద్ద ఎంగిలిపూల బతుకమ్మ ఆటలు ఆడిన ఎల్కతుర్తి గ్రామ మహిళలందరూ ముక్తకంఠంతో బతుకమ్మ పాటలు పాడుతూ ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. పాత గ్రామపంచాయతీ ఆఫీస్ వద్ద గ్రామములోని కులమత బేధాలు లేకుండా ప్రతి ఒక్క మహిళ ఎంగిలిపూల బతుకమ్మ ఆటలు ఆడుకుని సాయంత్రం వరకు అనగా 7:30 సమయం వరకు తిరుగు ప్రయాణం చేయడం జరిగినది ఇందులో పాల్గొన్న గ్రామ ఆడపడుచులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేసిన ఎల్కతుర్తి గ్రామ అధికారులు.



# సామాజిక అసమానతలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తాం

### కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్

జనగామ అక్టోబర్ 2 (ప్రజామంటలు):




కుల వివక్షత అంటరానితనంకు వ్యతిరేకంగా సామాజిక, ఆర్థిక, అంతరాలకు వ్యతిరేకంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవిపిఎస్) రాజీలేని పోరాటాలను కొనసాగిస్తుందని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బోట్ల శేఖర్ అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం 26 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జనగమ జిల్లా కేంద్రం పోలీస్ కంట్రోల్ వద్ద ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన, జెండాను జిల్లా అధ్యక్షుడు తుటి దేవదానం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బోట్ల శేఖర్ మాట్లాడుతూ కుల వివక్షత నిర్మూలనకై 1998 అక్టోబర్ రెండున ఆవిర్భవించిన కెవిపిఎస్ దళిత బడుగు పీడిత వర్గాల ఐక్యతకై పనిచేస్తుందని అన్నారు. రాజ్యాంగంలో 14వ అధికరణ నుండి 23 వరకు దళితుల సామాజిక ఆర్థిక అసమానతలను నిర్మూలించే అధికరణలు ఉన్న దేశంలో నేటికీ అంటరానితనం అన్ని రకాల వివక్షలు దళితులపై కొనసాగుతున్నాయని అన్నారు. నేటికీ దళితులను వెట్టిచాకిరి బలవంతపు చాకిరి వెలివేతలు భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నారని అన్నారు. దేశాన్ని పరిపాలిస్తున్న పాలకులు చట్టంలో ఉన్న అధికరణలను చిత్తశుద్ధితో అమలు చేయడంలో విఫలం అయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు పల్లెర్ల లలిత, గడ్డం యాదగిరి, సహాయ కార్యదర్శి జనగామ పట్టణ కార్యదర్శి బొట్ల శ్రావణ్ కుమార్, బచ్చన్నపేట మండల నాయకులు గంధమాల మనోహర్, ఎండి హతియా సుల్తానా, కర్ర రాములు గడ్డం చంద్రకళ, ఎర్ర కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి సుశీలమ్మ రుద్రమదేవి ఓల్డ్ ఏజ్ హోమ్ లో గాంధీ జయంతి

జనగామ అక్టోబర్ 02 (ప్రజామంటలు):



కోమటిరెడ్డి సుశీలమ్మ రుద్రమదేవి ఓల్డ్ ఏజ్ హోమ్ లో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి జనగామ జిల్లా జడ్జి శ్రీమతి సుచరిత, హోమ్ అధ్యక్షులు తాల్క లక్ష్మణ్ ఇంచార్జ్ సుంకరి దేవేందర్ హోమ్ సిబ్బంది వయోవృద్ధులు గాంధీ చిత్రపటానికి పూలు వేసి అంజలి ఘటించారు. అనంతరం సుచరిత వయోవృద్ధులచే క్షేమా సమాచారాలు అడిగి ఆరోగ్యపరంగా హోమ్ వాళ్లు వాకింగ్ ,యోగా వంటి కార్యక్రమాలు చేసుకుంటే ఆరోగ్యానికి మంచిదని 'ఆరోగ్యమే మహాభాగ్యమని' తెలిపారు. అనంతరం వయోవృద్ధులచే బతుకమ్మ ఆడి వారికి ఈ తొమ్మిది రోజులు మీరు బతుకమ్మ సంబరాలు జరుపుకోవాలని సూచించి వయోవృద్ధులకు పండ్లు వితరణ చేశారు.

## పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతి

కొడిమ్యాల అక్టోబర్ 02 (ప్రజామంటలు):



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొండూరి సురేష్ ఆధ్వర్యంలో అంగడి బజార్ లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ....సత్యం, అహింసలను ప్రపంచానికి చాటిన మహాత్ముడు గాంధీ, భారత స్వాతంత్ర ఉద్యమంలో అహింస,సత్యాగ్రహంతో గాంధీ ముఖ్య పాత్ర అని, గాంధీ చూపిన మార్గాలు ఆచరణ నీయమని, ప్రతి ఒక్కరు వారి ఆశయాలు పాటించాలని, అడుగుజాడల్లో యువత ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొండూరి సురేష్, ఉపాధ్యక్షులు కొంజర్ల రవీందర్, రాగి రఘునందన్, కోశాధికారి కోటగిరి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు రావికంటి సురేష్, ఆకుల చందు, కొత్త సాగర్, సభ్యులు చింత సత్యనారాయణ, రాగి సుధాకర్, మోటూరి శంకర్, కొండూరి రవీందర్, కొండూరి ప్రవీణ్, బొడ్ల నవీన్, బొల్లం శీను, ఉపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి, బొమ్మ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ లో గాంధీ జయంతి వేడుకలు

మెట్ పల్లి అక్టోబర్ 02 (ప్రజామంటలు):

మెట్ పల్లి బార్ అసోసియేషన్ లో బుధవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అధ్యక్షులు పుప్పాల లింబాద్రి మాట్లాడుతూ%ూ%. నాడు గాంధీజీ చేసిన పోరాటాలు, ఉద్యమాల వల్లే నేడు మనం స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో జీవిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షులు ఎలుముల రాంబాబు, సీనియర్ న్యాయవాదులు మగ్గిడి వెంకట్ నర్సయ్య, బద్దం లక్ష్మారెడ్డి, వొజ్జెల శ్రీనివాస్, కట్టా నర్సాగౌడ్, బక్కూరి రమేష్, రాంపల్లి జగన్, మన్నె గంగాధర్, ఒజ్జెల లక్ష్మణ్, గజభీంకర్ వెంకటేష్, ద్యావని సత్యనారాయణ, మగ్గిడి నర్సయ్య, పసునూరి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.





## గాంధీజీకి నివాళులు అర్పించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

### పాల్గొన్న మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి

సికింద్రాబాద్ అక్టోబర్ 02 (ప్రజామంటలు): జాతిపిత మహాత్మగాంధీ 155వ జయంతిని పురస్కరించుకొని సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్బంగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, మాజీ మంత్రి, మాజీ ఎన్డీఎంఏ ఉపాధ్యక్షులు మర్రి శశిధర్ రెడ్డిలు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం స్వచ్ఛ్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యువమోర్చా రాష్ట్ర నాయకులు మర్రి పురూరవరెడ్డి, నాయకులు పీఎల్.శ్రీనివాస్, మేకల సారంగపాణి, కార్పొరేటర్లు చీర సుచిత్ర, కొంతం దీపిక, కేతినేని సరళ, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఎంగిలి పువ్వుల బతుకమ్మ జరుపుకున్న మహిళలు

ఇల్లందకుంట అక్టోబర్ 02 (ప్రజామంటలు):

మల్యాల గ్రామంలో ఎంగిలి పువ్వుల బతుకమ్మ పండుగ లో మహిళలు మొదటి రోజు ఘనంగా నిర్వహించారు. అటా పాటల కోలాటాలతో ఊరంతా సందడి మొదలు కొంది. అక్కా చెల్లెలు మహిళలు ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగ గొప్పగా జరుపుకున్నారు.

# చినుకు పడితే చిత్తడే 'వారసంత లో వరద నీరు'



చిగురుమామిడి అక్టోబర్ 02 (ప్రజామంటలు):

చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న వారసంతలో చిన్న చిన్న చినుకులకె బురద మయంగా మారుతుంది అంగడి నిర్వహించే ప్రాంతమంతా గుంతల మయంగా ఉంది అని టెండర్ పాడిన నాటినుండి నేటి వరకు మూడు నెలలుగా గ్రామ పంచాయితీ చుట్టూ తిరుగుతూ గ్రామ కార్యదర్శి తో పాటు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారికి మండల అధికారులకు తెలియజేసిన పట్టించుకునే నాధుడే లేదని తట్టుడు మొరం కూడా గుంతలలో పోయడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన టెండర్ నిర్వాహకుడు తోట బాలయ్య ప్రతి వారము వారసంతల కూరగాయలు నిత్యవసర సరుకులు అమ్ముకునే వారు సైతం ఈ బురద ఉండడంతో టెండర్ నిర్వహకునికి డబ్బులు ఇవ్వడం లేదు బురదలో కూరగాయలు ఎలా అమ్మాలని వారు నిలదీస్తున్నారు గ్రామంలో ప్రధాన చౌరస్తా అయినా అంగడి జరిగే ప్రాంతం స్కూల్ చౌరస్తాలో ఇలా ఉంటే మరి గ్రామం పరిస్థితి ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని గ్రామంలో అంగడి జరిగే ప్రాంతంతో పాటు బతుకమ్మ పండుగ జరిగే ప్రాంతాలలో మొరం పోయాలని పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు కోరుతున్నారు.

# ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



మహాదేవపూర్ అక్టోబర్ 02 (ప్రజామంటలు):
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్, కాటారం మండలాల్లో ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పర్యటించి. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించారు, డ్వాక్రా సంఘాల మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. పలిమెల మండలానికి చెందిన యువతి పారా ఒలంపిక్స్ క్రీడలకు ఎంపికైన సందర్భంగా శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళల సాధికారిక విషయంలో మాటలకే పరిమితం కాకుండా మహిళలకు ప్రత్యేకంగా వ్యాపారం, వాణిజ్యం పరంగా వారి కుటుంబాలను పోషించే విధంగా ఉపాధి కల్పించే కార్యక్రమాలను చేపడుతుందన్నారు. నాణ్యమైన భోజనంతో పాటు టిఫిన్స్ అందించాలన్నారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన విషయంలో అన్ని విధాలుగా ముందుంటుందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ డ్వాక్రా మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రేపటి నుండి మొదలయ్యే దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంథని నియోజకవర్గ ప్రజలకు, భూపాలపల్లి జిల్లా ప్రజలకు ముందస్తుగా దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మాజీ ఎంపీపీ బి. రాణి బాయ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాపు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్, పిఎసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు కట్కం అశోక్, మహిళలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ కలలను సాకారం చేయాలి

## మహాత్మునికి ఘనంగా నివాళి





ధర్మపురి అక్టోబర్ 02 (ప్రజామంటలు):
స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు దాటినా, పేదల జీవన విధానంలో ఆశించిన ప్రగతిని సాధించలేక పోయామని, దీనికి పెరుగుతున్న జనాభా, నిరక్షరాస్యతలే ప్రధాన కారణాలని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధ వారం ధర్మపురి క్షేత్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో జాతిపిత విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పేదల అభ్యున్నతికి ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా, వారికి పథకాల పట్ల అవ గాహన లేకపోవడం, నిరక్షరాస్యులై ఉండడం మూలాన అవి వారి దరిచే రడం లేదని, వివిధ పథకాల అమలు లోగల లోపాలను గుర్తించి, సవరించు కోవాల్సిన అవసరాన్ని నేతలు నొక్కి చెప్పారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన ధ్యేయంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి సల్పా లని కోరారు. ఆర్యవైశ్యసంఘం అధ్య క్షులు మురికి శ్రీనివాస్, మండల అధ్య క్షులు కూరగాయల సంతోష్ ఆధ్వ ర్యంలో గాంధీ జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థాపించిన గాంధీ విగ్రహం వద్ద ఏటా నిర్వహిస్తున్న సాంప్రదాయంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు జాతిపిత విగ్రహాన్ని పూల మాలాలంకృత గావించి, ఘనంగా బాపూజీకి నివాళులర్పించారు. ఆర్యవైశ్య నేత జక్కు రవీందర్ నిర్వహించిన కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తమ్మ, కమిషనర్ బాలె గంగాధర్, నేనియర్ నాయకులు సౌళ్ళ భీమయ్య, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ భాస్కర్రెడ్డి, పి సి సి సభ్యులు దినేష్, పట్టణ అధ్యక్షులు రాజేశ్, బి జె పి నేతలు లక్ష్మణ్, శ్రీనివాస్, సంగి శేఖర్, గంగారెడ్డి, రవీందర్, రాజనర్సు, రంగ శంకరయ్య, వినోద్ రావు, వేంకటేశ్వర రావు, మనోహర్ రావు, తదితరులు కార్యక్రమాలలో భాగస్వాము లైనారు. మండల ప్రజా పరిషత్, మున్సిపల్, గ్రామ పంచాయతి కార్యాలయాలలో, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, ఇతర చోట్ల గాంధీ, శాస్త్రిలకు ఘనంగా నివాళులు అర్పించారు.

# నల్ల నరసింహులు జయంతి

## జనగామ పోపా ఆధ్వర్యంలో ఘన నివాళులు



జనగామ అక్టోబర్ 02 (ప్రజామంటలు):
జనగామ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న టైగర్ నల్ల నరసింహులు విగ్రహానికి జనగామ పద్మశాలి పోపా అధికార ప్రతినిధి పిట్టల సతీష్, ఆధ్వర్యంలో నల్ల నరసింహులు జయంతి సందర్భంగా పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనగామ పోపా అధ్యక్షులు దోర్నాల వెంకటేశ్వర్లు నల్ల నరసింహులు మనవడు డాక్టర్ శ్రీనివాస పద్మశాలి కళ్యాణ మండప నిర్మాణ కమిటీ ఉపాధ్యక్షులుభోగ రాం దయాకర చేనేత సెల్ జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామల పరమేశ్వర్ పాల్గొని మాట్లాడుతూ.... తెలంగాణ సాయుధ పోరాటంలో నాయకత్వం వహించిన వారిలో అతి పిన్న వయసు నల్లా నరసింహులుగారు అని పరాక్రమములో అభిమన్యుడు. దక్షతలో ధనుంజయుడు. పద్మవ్యూహములను, చక్ర బంధాలను అతి చాకచక్యంగా తప్పించుకున్న విజయుడు, మృత్యుంజయుడు నల్లా నరసింహులు అన్నారు. పాతికేళ్లు కూడా నిండకుండానే ప్రముఖ ప్రజా నాయకుడిగా ఎదిగి ఉరిశిక్ష విధించబడిన నల్లా నరసింహులు పోరాట సమయం లోనూ, మిలటరికీ దొరికిన తర్వాతను అనేకమార్లు త్రుటిలో చావు నుండి తప్పించుకున్న మృత్యుంజయుడు. అతని ప్రజాభిమానమే అతన్ని కాపాడింది అన్నారు.తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రగతి, భాష, యాస పరిరక్షణ కొరకు ప్రజలను చైతన్యం చేసి ప్రత్యేక తెలంగాణ సాధించిన ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ ప్రజా శ్రేయస్సుకోసం ప్రాణాలు సైతం లెక్క చేయక పోరాడిన యోధులు నల్ల నరసింహులు, విగ్రహాని ట్యాంక్బండ్ పై ప్రతిష్టించి గౌరవించుకోవాలని జిల్లాకు నల్లా నరసింహులు పేరుని, పెట్టాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ పోపా ఉపాధ్యక్షులు ఏల జనార్దన్ కాముని శ్రీనివాస్ బాబు, పోపా కార్యదర్శి మదాసు యెల్లయ్య, కళ్యాణ మండప నిర్మాణ కమిటీ ఉపాధ్యక్షులు మచ్చ బాలనర్సయ్య, మంగళంపెల్లి జనార్దన్, దేవరుప్పుల మండల కాంగ్రెస్ చేనేత సెల్ అధ్యక్షులు, నల్ల యాదగిరి కలకుంట్ల చంద్రశేఖర్, పాము గోపి, తదితరులు పాల్గొన్నారు.

## "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో"

### (బతుకమ్మ పాట )

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
బతుకేదేట్లా తల్లి ఉయ్యాలో
ఈ మాయలోకంలో ఉయ్యాలో
ఆడబిడ్డలకు ఇంకా ఉయ్యాలో
రక్షనే కరువాయే ఉయ్యాలో
ఎటు చూసినా ఇంకా ఉయ్యాలో
కామాందులేనాయే ఉయ్యాలో
కాల నాగు వలే ఉయ్యాలో
కాటు వేసి చంపే ఉయ్యాలో
పసిబిడ్డలనైనా ఉయ్యాలో
ఇడిసి పెట్టరాయే ఉయ్యాలో
పండు ముసలైన ఉయ్యాలో
వదిలి పెట్టరాయే ఉయ్యాలో
స్వేచ్ఛ కోసం నాడు ఉయ్యాలో
చేసిన పోరాటం ఉయ్యాలో
ఇంటి దొంగలతోటి ఉయ్యాలో
భ్రస్టుపట్టి పాయే ఉయ్యాలో
ఏమి కాలం వచ్చే ఉయ్యాలో
ఎట్లా బతకాలిఇంక ఉయ్యాలో
రాముడేలిన రాజ్యము ఉయ్యాలో
కానరాదే తల్లి ఉయ్యాలో
కృష్ణుడేలిన  కాలం ఉయ్యాలో
కనిపించదే తల్లి ఉయ్యాలో
కలికాలంలోన ఉయ్యాలో
కామాంధుల నడుమ ఉయ్యాలో
కాలమెట్లాగడిచేది ఉయ్యాలో
మా బతుకులెట్లసాగేది ఉయ్యాలో
కరుణతో మాయమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
కదలి రావే తల్లి ఉయ్యాలో
కాళీ అవతారంలో ఉయ్యాలో
కామాంధుల తలలు ఉయ్యాలో
తెగ నరక రావమ్మ ఉయ్యాలో
ఆడబిడ్డలనింక ఉయ్యాలో
రక్షించవే తల్లి ఉయ్యాలో
ఆడబిడ్డలను ఇంకా ఉయ్యాలో
రక్షించరాతల్లి ఉయ్యాలో
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
బతుకేదేట్లా తల్లి ఉయ్యాలో
ఈ మాయలోకంలో ఉయ్యాలో....



రచన:
బుధారపు లావణ్య
జనగామ

# ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలి

## రేపటి నుండి 7 వ తేదీ వరకు సర్వే

## సర్వే కోసం నోడల్, స్పెషల్ అధికారుల నియామకం

## పైలట్ ప్రాజెక్టు కింద కుటుంబాల ఎంపిక పూర్తి

## రెవిన్యూ, పంచాయతీ, మున్సిపల్, మెడికల్ శాఖల అధికారులు సమన్వయముతో పని చేయాలి

## జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



జనగామ అక్టోబర్ 2 (ప్రజామంటలు):
బహుళ ప్రయోజనాలు చేకూర్చే లక్ష్యంతో.. ప్రభుత్వం డిజిటల్ కార్డులు జారీ చేసే కార్యక్రమాన్ని ప్రతిష్టత్మాకంగా తీసుకుందని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల గుర్తింపు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సంబంధిత అధికారులని ఆదేశించారు. అక్టోబర్ 3 నుంచి 7 వరకు అయిదు రోజుల పాటు జరిగే ఈ సర్వే ప్రక్రియ ని....క్షేత్రస్థాయిలో అధికారులు ప్రతీ ఇంటికి వెళ్లి.. ఆయా కుటుంబాల సమగ్ర వివరాలను సేకరించి నమోదు చేయాలని సూచించారు. ఇందుకోసం నోడల్ అధికారులను, కో ఆర్డినేషన్ అధికారులను, క్షేతస్థాయిలో వివిధ శాఖల అధికారులతో బృందాలను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. జనగాం కు సంబందించి.... జనగాం మండలం పెద్ద తండాలోని 138 కుటుంబాలను ఎంపిక చేసి ఎంపీడీఓ, ఎ.ఆర్.ఐ. జనగాం , పంచాయతీ సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశ అంగన్వాడీ వర్కర్ లతో కూడిన ఒక బృందం సభ్యులు సర్వే లో పాల్గొంటారని.... వీరికి నోడల్ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, కో ఆర్డినేషన్ అధికారి జడ్.పి. సీఈఓ సరిత వ్యవహరిస్తారని కలెక్టర్ తెలిపారు. జనగాం మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే 24 వ వార్డులోని పాత బీట్ బజారు, కుర్మ వాడ, నాగుల కుంట లోని 423 కుటుం బా లలో సర్వే జరుగు తుందని... నోడల్ అధికారిగా.. జనగాం ఆర్డీఓ కొమురయ్య అలాగే కో ఆర్డినేషన్ అధికారిగా జిల్లా పరిషత్ సిఈఓ సరిత ఉంటారని, క్షేత్ర స్థాయిలో మున్సిపల్ కమిషనర్, మేనేజర్, తహసీల్దార్, ఎం.ఆర్.ఐ., రెవిన్యూ కి, మున్సిపల్ కి సంబందిం చిన అధికారులతో కూడిన 3 టీమ్స్ ఉంటారా న్నారు. అలాగే స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం కి సంబందించి రఘునాథ్ పల్లి మండలం లోని కన్నాయిపల్లి లో 196, మాధారం గ్రామంలో 178 కుటుంబాలను ఎంపిక చేసి.... జనగాం ఆర్డీఓ ను నోడల్ అధికారిగా, కో ఆర్డినేషన్ అధికారిగా డీపీఓ స్వరూప ను అలాగే క్షేత్ర స్థాయి లో తహసీల్దార్ , పంచాయతీ సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్వాడీ,ఆశ వర్కర్ లతో కూడిన రెండు టీమ్స్ ని నియమించామన్నారు. పాలకుర్తి కి సంబం దించి... పాలకుర్తి మండలం రాఘవాపురం గ్రామంలోని 165 కుటుంబాలని ఎంపిక చేసి.. స్టేషన్ ఘనపూర్ ఆర్డీఓ వెంకన్న నోడల్ అధికారిగా, డి.ఆర్.డి.ఓ. పి.డి. వసంత కో ఆర్డినేషన్ అధికారిగా మండల తహసీల్దార్, ఎ.ఆర్.ఐ., పంచాయతీ సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశ, అంగన్వాడీ వర్కర్ లతో కూడిన రెండు బృందాలు ఈ సర్వే లో పాల్గొననున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియ కోసం జరిగే ఈ సర్వేను పకడ్బందీగా, పక్కా కార్యాచరణతో ప్రతీ అధికారి ముందుకు వెళ్లాలని... కుటుంబ సభ్యుల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎంపిక చేసిన కుటుంబాలకి సంబందించిన పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. సర్వే సందర్భంగా ఫ్యామిలీ ఫోటోను సేకరించడం తప్పనిసరి కాదని, ఫోటో కోసం ఎవరినీ ఒత్తిడి చేయరాదని స్పష్టం చేశారు.

# బీజేపీ డివిజన్ ప్రెసిడెంట్ రేసు లో గుంటి సత్తన్న



సికింద్రాబాద్ అక్టోబర్ 02 (ప్రజామంటలు): సనత్ నగర్ నియోజకవర్గం బన్సీలాల్ పేట డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్ష పదవికి బహుముఖ పోటీ నెలకొంది. ఇటీవల ప్రారంభమైన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఓ వైపు జోరుగా సాగుతుండగా, మరో వైపు డివిజన్ పార్టీ అధ్యక్ష పదవిపై పలువురు కన్నేసి, తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. డివిజన్ బీజేపీ అధ్యక్ష పదవి రేసులో మాజీ మంత్రి, సీనియర్ నేత మర్రి శశిధర్ రెడ్డి నమ్మిన బంటుగా ముద్ర పడిన సీనియర్ నాయకుడు గుంటి సత్యనారాయణ ముందువరసలో ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు దీర్ఘకాలికంగా డివిజన్ ప్రెసిడెంట్ గా పనిచేసిన అనుభవం ఉన్న గుంటి సత్యనారాయణ, తన రాజకీయ గురువు మర్రి శశిధర్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ నుంచి బీజేపీ లోకి వచ్చారు. అప్పట్లో కాంగ్రెస్ నుంచి ఎన్నికైన కార్పొరేటర్ల గెలుపులో గుంటి పాత్ర కీలకంగా ఉందని కార్యకర్తలు చెబుతున్నారు. నిష్పాక్షపాతిగా, నిజాయితీ పరుడుగా, ప్రజా సమస్యలపై నిత్యం గొంతు ఎత్తే గుంటి సత్యనారాయణ పేరును అధిష్టానం ప్రముఖంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అయితే గుంటి తో పాటు మరో ఇద్దరు నాయకుల పేర్లు వినిపిస్తున్నప్పటికీ వారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ కు సన్నిహితంగా ఉంటారనే ఆరోపణలు వారికి మైనస్ గా మారే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మరో వైపు మాజీ మంత్రి, మాజీ ఎన్డీఎమ్ఏ వైస్ ప్రెసిడెంట్ మర్రి శశిధర్ రెడ్డి, బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకులు మర్రి పురూరవరెడ్డి లు గుంటి సత్యనారాయణ కే బన్సీలాల్ పేట డివిజన్ ప్రెసిడెంట్ పదవిని ఇవ్వాలని ఇప్పటికే అధిష్టానానికి తెలిపినట్లు సమాచారం. గుంటికి పదవిని ఇవ్వాలని వారు గట్టి పట్టుదలతో ఉన్నట్లు కార్యకర్తలు పేర్కొన్నారు. కొద్ది రోజుల్లో డివిజన్ పార్టీ అధ్యక్షుల పేర్లు విడుదల అయ్యే అవకాశం ఉంటుండగా పార్టీ అధ్యక్ష పదవికై ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. మరో వైపు బీజేపీ అగ్రనాయకులు డివిజన్ అధ్యక్ష పదవిని ఎవరికిస్తే బాగుంటుందనే అంశంపై డివిజన్ లో రహస్య సర్వే కూడ నిర్వహిస్తున్నట్లు సమాచారం.

## వ్యవసాయ మార్కెట్ లో గాంధీ జయంతి వేడుకలు



గొల్లపల్లి అక్టోబర్ 02 (ప్రజామంటలు): గొల్లపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా సంతోష్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.... హింహ తొను స్వాతంత్ర్యం సాధించవచ్చును కానీ హింహా వలన మనమే ఎక్కువగా నష్టపోతామని సత్యం,అహింస మార్గాలనే ఎంచుకొని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు నడిపి స్వాతంత్ర్య ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించి భారత దేశానికి జాతిపిత అయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పురపాతి రాజిరెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టరులు కొక్కుల జలంధర్, చాడ సత్తయ్య, అత్తెన శివయ్య, జేరిపోతుల కొమురయ్య, వూటూరి అనుష, వుట్కూరి సురేందర్ రెడ్డి, కట్ట లక్ష్మన్, పట్టణ అధ్యక్షులు నేరెళ్ల మహేష్, మాజీ ఉపసర్పంచ్ కొండ వెంకటేష్ గౌడ్, చిర్ర దిలీప్ ఓర్స్ విజయ్, కచ్చు మల్లయ్య, ఆవుల ప్రవీణ్, మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆఫ్ గొల్లపల్లి ఆధ్వర్యంలో కుట్టు మిషన్ పంపిణీ

గొల్లపల్లి అక్టోబర్ 02 (ప్రజామంటలు): గొల్లపల్లి మండలం కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గొల్లపల్లి ఆధ్వర్యంలో లయన్ సజ్జనపు శ్రీనివాస్ సహకారముతో నిరుపేద మహిళలకు కుట్టు మిషన్ అందజేశారు. విశ్వబ్రాహ్మణ సంఘంలో మండల కేంద్రానికి చెందిన మారుపాక అఖిలకు కుట్టు మిషన్ ను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ కుట్టు మిషన్ ద్వారా రోజు వారి పనితో పాటు జీవన ఉపాధిని సంపాదించుకోవచ్చని అన్నారు. స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ ప్రతినిధులు, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నరహరి, కోశాధికారి సత్యనారాయణ, ప్రెసిడెంట్ వెంకటరమణ, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్





జగిత్యాల అక్టోబర్ 02 (ప్రజామంటలు): అహింసా, శాంతి మార్గంలో ఉద్యమించి బానిస సంకెళ్లు తెంచి బ్రిటిష్ పాలకుల నుంచి దేశానికి విముక్తి కలిగించిన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి జగిత్యాల పట్టణ గాంధీ నగర్, మంచి నీళ్ళ బావి, పురానీ పేట్ లలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. ఈ కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ లు బాలే లత శంకర, నక్క జీవన్, మేక పద్మావతి పవన్, శివ కేసరి బాబు, జయశ్రీ, కూసరి అనిల్, కప్పల శ్రీకాంత్, కూతురు రాజేష్, బోడ్ల జగదీష్, కొలగాని ప్రేమలత సత్యం, ఆరుముళ్ళ నరసమ్మ పవన్, కో ఆప్షన్ సభ్యులు హసిబొద్దిన్, శ్రీనివాస్, వైశ్య సంఘం అధ్యక్షులు ఊటూరి నవీన్, పట్టణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేలపోగులలో గాంధీ జయంతి స్వీట్లు పంపిణి




జనగామ అక్టోబర్ 02 (ప్రజామంటలు): జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నేలపోగుల గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి నేలపోగుల మాజీ ఎంపీటీసీ డాక్టర్ గుగ్గిళ్ళ నర్సయ్య, గ్రామశాఖ అధ్యక్షులు గైని ప్రవీణ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి ఘనంగా నిర్వహించి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ సభ్యులు జోగురాజు సీనియర్ నాయకులు గుగ్గిళ్ళ కొమురయ్య బాకీ అశోక్ గొల్లనకొండ నాగరాజు ఆవుల హరీష్, గోగు కొమరయ్య, కమ్మరి సత్తయ్య, బాష్పాక రవి, వడ్లకొండ సత్తయ్య, బాష్పాక బిక్షపతి, కందగట్ల భాస్కర్, గుగ్గిళ్ళ నాగేష్, సులుగురి యాదగిరి, గొల్లూరి కృష్ణ, బోడ శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు మైల రాజు, ఉపాధ్యక్షులు పన్నీరు, అరుణ్, గుగ్గిళ్ళ మనోజ్, మైల సాయి, వడ్లకొండ అఖిల్, పల్నాటి మహేందర్, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ అధ్వర్యంలో నల్ల నర్సింహులు 98వ జయంతి



జనగామ అక్టోబర్ 2 (ప్రజామంటలు): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుడు నల్ల నర్సింహులు 98 వ జయంతిని. సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మాజీ శాసనసభ్యులు సిహెచ్ రాజారెడ్డి, నర్సింహులు కుమార్తె చింతకింది అరుణ, డాక్టర్ శ్రీనివాస్, ఆది సాయన్న, మంగళంపల్లి జనార్ధన్ సూపర్ సోమయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి రాజారెడ్డి మాట్లాడుతూ.... నల్ల నరసింహులు సేవలు వెలకట్టలేనివని, ఆనాటి నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ ప్రాంత కర్కసుడైన రామచంద్రారెడ్డి జానకమ్మలకు వ్యతిరేకంగా చేసిన పోరాటం ఈ ప్రాంత ప్రజల మాన, ప్రాణాలకు తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన యోధుడు నల్ల నరసింహులు అని వారి పోరాట ఫలితమే ఈనాడు ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండి సుఖశాంతులతో బ్రతుకుతున్నారంటే వారి పోరాటం గొప్పదని అన్నారు. పోరాటాలు చేసిన యోధుని జయంతి వర్ధంతి లను ప్రభుత్వం అధికారికంగా చేయాలని, వారు సేవలు నాటి బ్రిటిష్ పాలకులే వారిని గుర్తించి తెలంగాణ టైగర్ గా బిరుదులు ఇచ్చినఅంతటి పోరాట పటిమ కలిగిన కమిటీ నల్ల నర్సింలు, విగ్రహం ట్యాంకు బాండ్ పై ఏర్పాటు చేసి వారి జయంతి వర్ధంతిలను అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యకర్తలు 50 నాయకులు గుర్రం మధు, వెంకటాద్రి, సుదర్శన్ గుగులోతు సఖి, మీనా ఘనంగా నివాళులర్పించారు.

## చేనేత రంగానికి పూర్వ వైభవం - మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్ (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగానికీ తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కమ్మ సంఘంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను మంత్రి తుమ్మల బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహాత్మ గాంధీ జయంతి రోజు చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. స్వాతంత్ర ఉద్యమ సమయంలో విదేశీ వస్తు బహిష్కరణ సందర్భంగా దేశ ప్రజల గౌరవాన్ని కాపాడింది చేనేత వృత్తిదారులేనని గుర్తు చేసుకున్నారు. ఆధునిక యంత్రాల ప్రవేశంతో తీవ్రతలు ఎదుర్కొంటున్న పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. ఇప్పటికే కొనసాగుతున్న చర్యలతో తోడు మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు త్వరలోనే ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## జనగామలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ తెలంగాణ 22వ ఆవిర్భావ దినోత్సవం



జనగామ అక్టోబర్ 2 (ప్రజామంటలు): రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ తెలంగాణ 22వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జనగామ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ప్రసంగిస్తూ ఈమధ్య జరిగిన పదోన్నతుల్లో మిగిలిపోయిన భాషాపండితులకు కూడా ప్రమోషన్ లు ఇప్పించేదుకు రాష్ట్ర నాయకత్వం ప్రయత్నాలు చేస్తోందని వివరించారు. జిల్లా అధ్యక్షులు సిరికొండ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి పూట్ల శ్రీనివాసచారి, కోశాధికారి లక్ష్మన్ బాబు, పానుగంటి రామమూర్తి, సంఘబాధ్యులు గోపికిషన్, శేషుకుమార్, సునీత, వసంత, సరళాదేవి, స్థానిక పాఠశాల క్రిష్ణమూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆసుపత్రిలో గాంధీ జయంతి వేడుకలు



సికింద్రాబాద్ అక్టోబర్ 02 (ప్రజామంటలు): గాంధీ ఆసుపత్రిలో గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి ఆసుపత్రి ఆవరణలోని గాంధీ మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే మాజీ ప్రధాని, దివంగత లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ వన్ డాక్టర్ శేషాద్రి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అహింస మార్గాన్ని ఎంచుకొని అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన వ్యక్తి మహాత్మా గాంధీ

### సమానత్వం, శాంతి కోసం చేపట్టిన గాంధీ సిద్ధాంతాలు ప్రేరణగా నిలిచాయి

### అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్



జనగామ అక్టోబర్ 02 (ప్రజామంటలు): స్వేచ్ఛ, సమానత్వం కోసం బ్రిటిష్ పాలననుంచి భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన పూజ్యనీయులు బాపూజీ మహాత్మా గాంధీ అని, ఆ మహనీయుని అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 155వ మహాత్మా గాంధీ జయంతి ఉత్సవం ఘనంగా జరిగింది. జిల్లా అధికారులు, సిబ్బంది తో కలిసి అదనపు కలెక్టర్ గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... సమానత్వం, శాంతి కోసం గాంధీజీ చేపట్టిన పోరాటాలు, సిద్ధాంతాలు మనకు ప్రేరణగా నిలిచాయన్నారు. విదేశీ వస్తువులను బహిష్కరించాలని దేశం లో తయారయ్యే దుస్తులను మాత్రమే ధరించాలని ఆనాడు గాంధీజీ చేపట్టిన ఉద్యమ ఫలితమే ఈనాడు జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. అహింస అనే ఆయుధంతో చేపట్టిన ఉద్యమాలు యావత్ ప్రపంచానికే స్ఫూర్తిగా నిలిచాయాన్నారు. ఆ మహనీయుని త్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ స్వాతంత్ర్యాలుగా పేర్కొన్నారు. గాంధీజీ కన్న కలలు సాకారం అయ్యేలా వారి అడుగు జాడల్లో నడుస్తూ స్వాతంత్ర్య ఫలాలను భవిష్యత్ తరాల వారికి అందేలా ప్రతి ఒక్కరం కృషి చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగు కోసం జిల్లాలో చేపట్టిన స్వచ్ఛతాహి కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని ఆనాడు గాంధీజీ కన్న కలలు సాకారం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రవీందర్, వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయక్, విద్యాశాఖ అధికారి రాము, పశుసంవర్ధక శాఖ అధికారి రాధా కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## బౌద్ధనగర్ లో ఘనంగా గాంధీ జయంతి

సికింద్రాబాద్ అక్టోబర్ 02 (ప్రజామంటలు): గాంధీ జయంతిని పురస్కరించుకొని సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్ సంజయ్ గాంధీ నగర్ లోని గాంధీ విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డివిజన్ కార్పొరేటర్, సీనియర్ బీఆర్ఎస్ నాయకురాలు కంది శైలజ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో బాపూజీ పాత్రపై ఆమె ప్రసంగించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, రాజేశ్ పాల్గొన్నారు.





## ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

వేలేరు అక్టోబర్ 02 (ప్రజామంటలు):
వేలేరు మండల కేంద్రంలో మహాత్మ గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి పూలమాలలు వేసి,టెంకాయలు సమర్పించిన మాజీ ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్ ఈ సందర్భంగా సద్దాంహుస్సేన్ మాట్లాడుతూ.... ప్రఖ్యాత స్వతంత్ర కార్యకర్త మరియు భారతదేశంలోని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భారతదేశం యొక్క స్వాతంత్ర పోరాటాలలో ముఖ్యమైన పాత్ర పోషించిన శక్తివంతమైన రాజకీయ నాయకుడిగా దేశ పితామహుడిగా పరిగణించబడ్డ గొప్ప వ్యక్తి అనీ భారతదేశంలోని పేద ప్రజలను మెరుగుపరిచిన మహోన్నత్తుడు అనీ దేశ స్వాతంత్రం కోసం చాలమందిని ప్రభావితం చేసినా గొప్ప వ్యక్తి, అహింస అతని భావజాలం అని అన్నారు.

## గాంధీ జయంతి వేడుకలు మరియు గ్రామసభ



వేలేర్ అక్టోబర్ 02 (ప్రజామంటలు):
వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామపంచాయతిలో అక్టోబర్ – 2 రెండును పురస్కరించుకొని మహాత్మా గాంధీ జయంతి వేడుకలను చేయడం జరిగింది. ఆ తర్వాత గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభలో గ్రామపంచాయతీ ఆదాయ వ్యయాల గురించి, స్వచ్ఛతాహి సేవలో భాగంగా గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య ప్రత్యేక కార్యక్రమాల గురించి, వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేయబోయే జిపిడిపి యాక్షన్ ప్లాన్ మరియు ఉపాధి హామీ పనుల గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రూపవతి పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఎఫ్.ఎ. మల్లన్న, మాజీ సర్పంచులు-ఎంపీటీసీలు గ్రామస్తులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేలేరు యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ అక్కల ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి జెట్టి అరవింద్, యువజన నాయకులు కూరపాటి శ్రీకాంత్, గుండు ప్రశాంత్, రాజేందర్, సాంబరాజు రవి, చంటి, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఇల్లందకుంట శ్రీ సీతా రామ చంద్ర స్వామి దేవస్థానంలో

## శ్రీ రామ శరన్నవరాత్రి ఉత్సవములు

ఇల్లందకుంట అక్టోబర్ 02 (ప్రజామంటలు):
తేదీ.03/10/2024 గురువారము నుండి తేదీ 12/10/2024 శనివారం వరకు శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఇల్లంధకుంట నందు దసరా ఉత్సవములను పురస్కరించుకొని శ్రీశ్రీ రామ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవముగా నిర్వహించబడును. ఇందులో భాగంగా ప్రతిరోజు ఉదయం శ్రీ స్వామివారికి ప్రత్యేక అభిషేకములు అర్చనలు తీర్థ ప్రసాద వినియోగము జరుగును. ఇందులో భాగంగా తేదీ.10/10/2024. గురువారం రోజున సద్దుల. బతుకమ్మ పండగ. తేదీ 12/10/2024. శనివారం రోజున దసరా పండుగ జరుగును. దసరా పండుగ రోజున శ్రీ స్వామి వారి ప్రధాన దేవాలయం నందు ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు శ్రీ స్వామివారికి ప్రత్యేక అభిషేకములు అర్చనలు స్నాపన తిరుమంజనా



కార్యక్రమము నిర్వహించబడును. మరియు వాహన పూజలు నిర్వహించబడును సాయంత్రం ఐదు గంటలకు శ్రీ స్వామివారి గ్రామ దేవాలయములో శమీ వృక్ష పూజ జరిగిన అనంతరం శ్రీ స్వామి వారు అశ్వ వాహనంపై గ్రామ పురవీధులలో భక్తులకు దర్శనమిస్తారు. ఇట్టి కార్యక్రమంలో భక్తులు తప్పనిసరిగా అధిక సంఖ్యలో పాల్గొనాలని కార్య నిర్వహణ అధికారి కె. సుధాకర్ కోరారు.

## ఖాది వస్త్రాలను ధరిద్దాం.. ఖాదిని కాపాడుకుందాం!

### వావిలాలలో రాట్నం వడికిన వొడితల ప్రణవ్ బాబు

జమ్మికుంట అక్టోబర్ 02 (ప్రజామంటలు):
జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలోనీ 'వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్' సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే అఖండ సూత్ర యజ్ఞం కార్యక్రమంలో పాల్గొన్న హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. వావిలాల ఖాదిలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు దేశ స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించిన ఖాదీని కాపాడుకుందామని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ బాబు అన్నారు. బుధవారం జమ్మికుంట మండలం వావిలాల లో మహాత్మా గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన మాట్లాడారు. మహాత్మ గాంధీ చెరకుతో ఖాది వస్త్రాలను నేస్తూ స్వాతంత్ర ఉద్యమాన్ని నడిపించారని అన్నారు. విదేశీ వస్త్రాల బహిష్కరణ చేస్తూ ఖాదీ ని ప్రోత్సహించారని అన్నారు. నాటి స్వాతంత్రోద్యమంలో చాలామంది ఉద్యమ నాయకులు ఖాదీని ఉపయోగించారని అన్నారు. దేశ సమైక్యత కూడా వస్త్రాలతో కనిపించిందన్నారు. నాటి





తరాన్ని స్ఫూర్తిగా తీసుకొని మనం కూడా ఖాదీ వస్త్రాలను ఉపయోగించాలన్నారు. స్వాతంత్రోద్యమంలో గొప్ప పాత్ర పోషించిన ఖాదీ ప్రతిస్తాన్ లో గాంధీ మహాత్ముని జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేశారు.

## ధర్మపురి క్షేత్రంలో బతుకమ్మ వేడుకలు ప్రారంభం..



ధర్మపురి అక్టోబర్ 02 (ప్రజా మంటలు) :
భారతీయ ప్రాచీన సంస్కృతికి, సనాతన హైందవ సాంప్రదాయాలకు అనాదినుండి పట్టు కొమ్మగా నిలిచియున్న సుప్రసిద్ధ గోదావరి తీరస్థ పుణ్య తీర్థమైన ధర్మ పురి క్షేత్రంలో బతుకమ్మ పండుగ సంబరాలు బుధవారం సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా ప్రారంభం అయినాయి. ప్రతి పండుగనూ పరంప రానుగతంగా ప్రత్యేక శైలిలో, విశిష్ట పద్ధతిలో జరుపుకునే ధార్మిక కార్యాచ రణాసక్తుల నిలయమైన ధర్మపురి క్షేత్రంలో అపురూప సోదరీమణులైన జేష్టాదేవి, లక్ష్మీదేవిలను కొలుస్తూ, బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలను భక్తి శ్రద్ధలతో, పిల్లా పాపలతో కలిసి మహిళలు జంట పండుగలుగా పక్షం రోజుల తేడాతో నిర్వహించడం ఈ సనాతన క్షేత్రంలో అనాదిగా ఆచరిస్తున్న సనాతన సాంప్రదాయం. భద్ర పద అమావాస్యతో ప్రారంభించి మహర్నవమితో ముగించబడే బతుకమ్మ పండుగలో మొదటిరోజున క్షేత్రం నడిబొడ్డున గల మహిమాన్విత మైన బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో, రెండవ రోజునుండి చద్దుల బతుకమ్మ వరకు, పవిత్ర గోదావరి నదిలో ఆట పాటలతో నిర్వహించి పిల్లా పాపలతో మహిళలు తన్మయత్వం పొందుతారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, బంగారు బతుకమ్మ ఉయ్యాలో.... ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ బతుకమ్మ గూర్చి, జనకునింటి ఉయ్యాలో అంటూ భూజాతయైన మహాసాధ్వి సీతాదేవి గురించేగాక కల వారి కోడలు కలికి కామాక్షి అంటూ సామాజిక అంశాల సమస్యలపై సైతం జానపద బాణీలో బృందగానం చేసే సాంప్రదాయ గీతాలు మంత్రముగ్ధులను గావిస్తాయి. మహాలయ అమా వాస్య బుధ వారం నుండి ధర్మపురి క్షేత్రం బతుకమ్మ సంబరాలకు వేదికైంది. తొలి రోజు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేసి, బతుకమ్మకు కొబ్బరి కాయలు సమర్పించి, లాంఛనంగా ప్రారంభించారు. చైర్ పర్సన్ సంగి సత్తమ్మ, వేముల నాగలక్ష్మి, జక్కు రవీందర్, సంగన భట్ల దినేష్ తదితరులు బతుకమ్మ ఉత్సవాల నేపథ్యం గురించి వివరించారు. ఈ వైస్ చైర్మన్ రామయ్య, కమిషనర్ గంగాధర్, శానిటరీ ఇన్స్పెక్టర్ గంగాధర్, కౌన్సిలర్ లు, ఆర్పీలు, ఆశా కార్యకర్తలు, అధికారులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు. బ్రహ్మ పుష్కరిణి (కోనేరు) వద్ద మహిళలు కుల మతాలకు అతీతంగా సామూహికంగా బతుకమ్మలను ఒక్కచోట ఉంచి వలయాకారంగా తిరుగుతూ పాటలు పాడి, వెంట తెచ్చుకున్న తినుబండా రాలను ముందుగా నైవేద్యం పెట్టి, బతుకమ్మలను నదీ నీటిలో నిమజ్జనం గావించి, నివేదనలను తోటివారికి పంచుతూ, పిల్లలతో ముత్తయిదులు సామూహికంగా ఆరగించారు. సాయంత్రమంతా ఆహ్లాదకర వాతావ రణంలో గడిపి చీకటి పడ్డాక ఇళ్ళకు చేరుకున్నారు.

## ఘనంగా మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

### మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇంగిలే రామారావు



జమ్మికుంట అక్టోబర్ 02 (ప్రజామంటలు):
సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో శాంతియుతంగా పోరాడి కోట్లాది భారతీయులకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యన్ని అందించిన మహనీయులు జాతిపిత మహాత్మా గాంధీ అని రామారావు అన్నారు. గాంధీజీ 155వ జయంతి సందర్భంగా గాంధి చిత్రపటానికి పూలమాల వేసి ఆ మహనీయుడికి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే స్వాతంత్ర సమరయోధులు భారతరత్నఅవార్డు గ్రహీత మాజీ ప్రధాని లాల్ బహుదూర్ 120 వ జయంతి సందర్భంగా లాల్ బహుదూర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. జై జవాన్, జై కిసాన్ నినాదంతో సైనిక పరంగా వ్యవసాయపరంగా పటిష్ట పరిచిన దార్శనికుడు అని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పరమేష్, కిరణ్, మహేష్, గోపాల్ రెడ్డి, సాయి రమేష్, రాజబాబు, రవికుమార్, రమేష్, ఎల్లయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బోయిగూడ ప్రాంతంలో ఫుట్ పాత్ ల ఆక్రమణలు



సికింద్రాబాద్ అక్టోబర్ 02 (ప్రజామంటలు):
బన్సీలాల్ పేట డివిజన్ బోయిగూడ వై జంక్షన్ సమీపంలో ఇటీవల రోడ్డు ఆక్రమణలు పెరిగిపోయాయి. ఇక్కడి బస్టాప్ సమీపంలోని ఓ హెూటల్ యజమాని ఫుట్ పాత్ ను ఆక్రమించుకొని నిర్మాణాలు చేయడంతో ఇక్కడ పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు వెళ్ళకుండా ప్రధాన రహదారి వరకు తన హెూటల్ సీసీ ఫ్లోర్ ను విస్తరించడంతో నీరు ఓ వైపున నిలిచిపోయి బురదమయంగా మారి, దోమలు, దుర్వాసన పెరిగిపోయాయని స్థానికులు వాపోతున్నారు. దాంతో తమ ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. ఇప్పటికైన టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి, వర్షపు నీరు వెళ్ళేలాగా చర్యలు తీసుకోవాలని, తమ ఆరోగ్యాన్ని కాపాడాలని వేడుకుంటున్నారు.



## గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల అక్టోబర్ 02 (ప్రజామంటలు):
జగిత్యాల పట్టణంలోని పురాణిపేట్ వాడలో గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మరియు మున్సిపల్ చైర్ పర్సన్ అడవాల జ్యోతి లక్ష్మణ్. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మున్సిపల్ కమిషనర్ కౌన్సిలర్స్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్స్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు, వివిధ హెూదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## నేషనల్ యాంటీ డ్రగ్ డే సందర్భంగా సాహితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2కె. రన్

### జెండా ఊపి ప్రారంభించిన హుజురాబాద్ పట్టణ సీఐ తిరుమల్ గౌడ్ మున్సిపల్ చైర్పర్సన్ గందె రాధిక శ్రీనివాస్



హుజురాబాద్ అక్టోబర్ 02 (ప్రజామంటలు):
సాహితి ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ రాముల కుమార్ ఆదేశాల మేరకు బుధవారం హుజురాబాద్ పట్టణంలో నేషనల్ యాంటీ డ్రగ్ డే సందర్భంగా అవేర్నెస్ కార్యక్రమం 2కె రన్ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్,పట్టణ సీఐ తిరుమల్ గౌడ్ జండా ఊపి మారథన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి ఆరోగ్యాలను పాడు చేసుకుని జీవితాలు సర్వనాశనం చేసుకుంటున్నారని అటువంటి యువతను మంచి మార్గాలు నడపడం కోసం సాహితి ఫౌండేషన్ చేస్తున్నటువంటి కృషి అభినందనీయమని తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక విద్యను అభ్యసించాల్సిన విద్యార్థులు మత్తుకు బానిసలుగా మారి కుటుంబాలకు ఆసరాగా లేకుండా పోతున్నారని సమాజాన్ని రక్షించాల్సిన విద్యార్థులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అటువంటి యువతకు మార్గదర్శకంగా సాహితి ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా టూకే రన్ లో గెలుపొందిన సభ్యులకు ఫౌండేషన్ కోఆర్డినేటర్లు మెమొంటో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, సాహితి ఫౌండేషన్ వైస్ చైర్మన్ కొలిపాక రమేష్, ఫౌండేషన్ కోఆర్డినేటర్లు ఏనుగు మహిపాల్ రెడ్డి, కొండం శ్రీధర్ రెడ్డి, సంతోష్, మహమ్మద్ అంకుష్, కొండల్ రెడ్డి, చైతన్య రెడ్డి, మహేష్, ప్రశాంత్, 200 మంది వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.




## ఆటో సంక్షేమ సంఘం అధ్యక్షులుగా కొక్కుల శ్రీనివాస్



గొల్లపల్లి అక్టోబర్ 02 (ప్రజామంటలు):
గొల్లపల్లి మండల డీజిల్ ఆటో సంక్షేమ సంఘం అధ్యక్షులు గా కొక్కుల శ్రీనివాస్ ఉపాధ్యక్షులు ఇప్ప నగేష్ , ప్రధాన కార్యదర్శి సాంబార్ అర్జున్, కోశాధి కారి మహేందర్, మారుతి, సుధాకర్, నక్క స్వామి, నల్ల కిరణ్, తిరుపతి, గంగన్న, చరణ్, శంకరయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com